# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




నేడు లండన్‌కు సీఎం చంద్రబాబు దంపతులు 2



## జాప్యం లేకుండా రాజధాని నిర్మాణం

- నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి
- పెండింగులో ఉన్న రిటర్నబుల్ ప్లాట్లను త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలి
- సీఆర్డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

2

రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యానికి నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌వంటి అంశాలపై శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు? వర్క్ ఫోర్స్ ఏమేరకు ఉంది? నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్, మెషినరీని ఆయా సంస్థలు ఏమేరకు సమకూర్చుకున్నాయనే దానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని... ఆమేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు.

## తుపాను నష్టం.. రూ.5,244 కోట్లు

- మొంథా తుఫాను పరిణామాలపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక
- తక్షణం రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్రానికి వినతి
- ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలను కోరిన ఏపీ

4



ప్రజాసేవ, సామాజిక ప్రభావంలో

## నారా భువనేశ్వరి కృషికి గుర్తింపు

- ప్రతిష్ఠాత్మక సంస్థ ఐఓడీ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు
- కార్పొరేట్ రంగంలోనూ దార్శనిక నాయకత్వానికి గోల్డెన్ పీకాక్ అవార్డు
- లండన్‌లో ఈ రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకోనున్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ భువనేశ్వరి

- వివరాలు 6 లో..

## పంటపొలాలపై ఫోకస్

- యుద్ధప్రాతిపదికన క్షేత్రాల్లోని నీటి నిల్వలు మళ్లింపు
- శాటిలైట్ చిత్రాలతో గుర్తించి 24 గంటల్లో పూర్తి కార్యాచరణ
- ఆస్తినష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించండి
- తుఫాన్ విధుల్లో ప్రతిభ చూపిన 100మందికి సన్మానం
- టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

2





5

శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి

## ఆలయ పునఃనిర్మాణం

- శంకుస్థాపన మహోత్సవంలో మంత్రి లోకేష్

## చర్చలు సఫలం.. ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణ

- మంత్రి సత్యకుమార్, అశా ప్రతినిధుల మధ్య చర్చలు ఫలవంతం
- మూడో విడత కింద రూ.250 కోట్లు విడుదలకు అంగీకారం
- వన్ టైం కింద మొత్తం బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం సంసిద్ధత

9



## విపత్తును జట్టుగా ఎదుర్కొన్నాం

- రాష్ట్రానికి వైసీపీనే అసలు విపత్తు
- విపత్కర పరిస్థితుల్లోనూ విషం చిమ్ముతున్నారు
- క్రమశిక్షణే టీడీపీ బలం...
- ఉల్లంఘించినవారిపై చర్య తప్పదు
- టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు

3

98 శాతానికి పైగా

## విద్యుత్ పునరుద్ధరణ

- సీఎం చంద్రబాబు ముందు చూపుతో యంత్రాంగం అప్రమత్తం
- తుఫాన్ పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాల నిర్వహణ
- ప్రభుత్వంపై నిందలు మోపాలనేదే జగన్ దుష్ట పన్నాగం
- ఐదేళ్ల పాలనలో నిండా ముంచేసి నేడు అసత్య ప్రచారాలు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

7



# జాప్యం లేకుండా రాజధాని నిర్మాణం

- నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి
- పెండింగులో ఉన్న రిటర్నబుల్ ప్లాట్లను త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలి
- సీఆర్డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యానికి నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌వంటి అంశాలపై శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు? వర్క్ ఫోర్స్ ఏమేరకు ఉంది? నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్, మెషినరీని ఆయా సంస్థలు ఏమేరకు సమకూర్చుకున్నాయనే దానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్థిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని... ఆమేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. నిర్మాణాల్లో వేగంతోపాటు.. నాణ్యత ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షిస్తానని చెప్పారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనుల్లో కొంత మేర జాప్యం జరిగినా.. రానున్న రోజుల్లో దాన్ని భర్తీ చేసేలా నిర్మాణాల్లో వేగం పెంచాలని చంద్రబాబు సూచించారు. ఇంకా కొన్ని నిర్మాణ సంస్థలు వర్క్ ఫోర్స్, మెషీనరీని పూర్తి స్థాయిలో కేటాయించలేదని... ఇలా ఉన్న సంస్థలు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాజధాని భవనాల నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈమేరకు గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

### రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు పూర్తైందని సీఎం ఆరా తీశారు. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు రానివ్వొద్దని మంత్రి నారాయణ, అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు అధికారులు అందించారు. ఇంకా 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని.. ఇవి కూడా చిన్నపాటి సాంకేతిక, రైతుల వ్యక్తిగత అంశాల కారణంగా పెండింగులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తాను కూడా త్వరలోనే రాజధాని రైతులతో సమావేశమవుతానని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో నిర్మాణాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నామో..గ్రీనరీ, సుందరీకరణ, పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానుల గార్డెనింగ్, బ్యూటిఫికేషన్ వంటి వాటిల్లో ఎలాంటి రాజీపడొద్దని సూచించారు. ఇక ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్లో ఉండేలా చూడాలని ఆయా సంస్థల ప్రతినిధులను కోరాలని అధికారులకు సూచించారు. అమరావతికి వరల్డ్ క్లాస్ సిటీ లుక్ రావాలంటే హైరెయిజ్ బిల్డింగులు ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఫైనాన్స్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంటపొలాలపై ఫోకస్

- యుద్ధప్రాతిపదికన క్షేత్రాల్లోని నీటి నిల్వలు మళ్లింపు
- శాటిలైట్ చిత్రాలతో గుర్తించి 24 గంటల్లో పూర్తి కార్యాచరణ
- ఆస్తినష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించండి
- తుఫాన్ విధుల్లో ప్రతిభ చూపిన 100మందికి సన్మానం
- టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ తదనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి శనివారానికి మొత్తం నీటిని మళ్లించాలని సీఎం ఆదేశించారు. నియోజకవర్గం వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేసి... ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడకి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. అందరూ కలిసి సమన్వయంతో పని చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో ఫలితాలు రాబట్టాలని సీఎం సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని... పంటలు నీట మునగడంవల్ల దిగుబడి తగ్గకుండా తగు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకన్నా ఎక్కువగా 60 శాతంమేర బాపట్ల జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బాపట్ల జిల్లాలో మాత్రం ఆదివారంనాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని విన్నవించారు.


### కేంద్రాన్ని తక్షణ సాయం కోరండి

మొంథా తుఫాన్‌తో రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెనువెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు కేంద్ర బృందాన్ని ఆహ్వానించాలన్నారు. తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సాయం అందించేలా కేంద్రాన్ని కోరాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయమై తాను ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే కృష్ణా నదిలో ప్రస్తుతం కొనసాగుతున్న నీటి నిల్వల వివరాల గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే కృష్ణాలో వరద ఉధృతి తగ్గిందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. అలాగే మొంథా తుఫాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. శనివారం ఉదయం 10 గంటలకు సుమారు 100మందిని గౌరవించుకునేలా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

## లండన్‌కు సీఎం చంద్రబాబు

- వ్యక్తిగత పర్యటనలో భాగమేనన్న సీఎంవో
- నేటి రాత్రి సతీమణి భువనేశ్వరితో కలిసి ప్రయాణం
- ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డ్ -2025కు ఎంపికైన భువనేశ్వరి
- ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సులో హెరిటేజ్ ఫుడ్స్ గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకోనున్న భువనేశ్వరి
- లండన్‌లో 4న జరిగే రెండు అవార్డులు కార్యక్రమంలో పాల్గొనున్న చంద్రబాబు దంపతులు

అమరావతి (చైతన్య రథం): వ్యక్తిగత పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... సతీమణి భువనేశ్వరితో కలిసి శనివారం రాత్రి హైదరాబాద్‌నుంచి లండన్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. నవంబరు 4న ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ లండన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు అందించనుంది.



అలాగే, హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సు విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును భువనేశ్వరి అదే వేదికపై అందుకోనున్నారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతారు. విశిష్ట వ్యక్తిగా పేర్కొంటూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నారా భువనేశ్వరిని డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు 2025కు ఎంపిక చేసింది. ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకంగా పని చేసినందుకుగానూ ఈ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును సంస్థ ఆమెకు అందించనుంది. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థనుంచి భువనేశ్వరి అవార్డును అందుకోనున్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సామాజిక సాధికారితకు పాటుపడుతున్న వ్యక్తిగా ఆమెను ఈ ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో చైర్మన్ గోపిచంద్, ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ చైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా, సన్ ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ, దుబాయ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ అథారిటీ ఎండీ సయీద్ మహ్మద్, హీరో ఎంటర్‌ప్రైజెస్, గోయెంకా గ్రూప్ సంస్థల చైర్మన్ సంజీవ్ గోయెంకావంటి దిగ్గజ వ్యక్తులు గతంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు.

### హెరిటేజ్ ఫుడ్స్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డు

ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సులో హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలోనూ భువనేశ్వరి గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకోనున్నారు. ఎఫ్ఎంసీజీ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు జాతీయస్థాయిలో ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సు విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డుకు ఐఓడీ ఎంపిక చేసింది.

### పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీలు

లండన్‌లో వ్యక్తిగత పర్యటన అనంతరం పలు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరుగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నారు. దీనికి సంబంధించి లండన్‌లోని పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రవాసాంధ్రులతోనూ సీఎం భేటీ కానున్నారు. నవంబరు 6న సీఎం తిరిగి రాష్ట్రానికి రానున్నారు.

# విపత్తును జట్టుగా ఎదుర్కొన్నాం

- రాష్ట్రానికి వైసీపీనే అసలు విపత్తు
- విపత్కర పరిస్థితుల్లోనూ విషం చిమ్ముతున్నారు
- క్రమశిక్షణే టీడీపీ బలం...
- ఉల్లంఘించినవారిపై చర్య తప్పదు
- టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు







అమరావతి, (చైతన్య రథం): మొంథా తుఫానువల్ల ఎవరికీ ఏ ఇబ్బందీ రాకుండా ప్రభుత్వ యంత్రాంగం, కూటమి పార్టీలు కలిసి పనిచేశాయని, దీనివల్ల ప్రాణ, ఆస్తినష్టం నివారించగలిగామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్రకార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పార్టీ విభాగాలతో సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... ప్రభుత్వ యంత్రాంగం, మంత్రులు, ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా పనిచేసి తుఫాను సమయంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. తుఫాన్ ముప్పు ఉంటుందని సమాచారం అందగానే అందరినీ అలెర్ట్ చేశామన్నారు. వరద సమయంలో పార్టీశ్రేణులు చూపిన సేవాభావం అభినందనీయమని, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలకు అందించిన సాయం ప్రశంసనీయమని తెలిపారు. తుఫాను బాధితులకు అండగా నిలిచిన పార్టీనేతల పనితీరును, క్షేత్రస్థాయిలో ఉండి పనిచేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలను సీఎం చంద్రబాబు అభినందించారు. విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం ముందుంటే.. దుష్ప్రచారంలో వైసీపీ నేతలు ముందున్నారని విమర్శించారు. తుఫాన్‌వల్ల రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరగలేదని వైసీపీ బాధపడుతున్నట్లుందని ఎద్దేవా చేశారు. బాధితులకు అండగా నిలవకుండా రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్న వైసీపీ తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. వైసీపీ చేసే ఫేక్ ప్రచారాలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## పరకామణి కేసులో నిందుతులను వైసీపీ కాపాడే ప్రయత్నం

"ప్రపంచవ్యాప్తంగా భక్తుల మనోభావాలతో ముడిపడివున్న టీటీడీలో కూడా వైసీపీ నేతలు అవినీతికి పాల్పడి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీశారు. కల్తీ నెయ్యి వ్యవహారం భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. తిరుమల పవిత్రతను మంటగలిపారు. పరకామణి వ్యవహారంలో వైసీపీ నేతలు నిందితులను కాపాడే విధంగా వ్యవహరించటం సిగ్గుచేటు. వైసీపీ నేతలు టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు" అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

"క్రమశిక్షణే తెలుగుదేశం పార్టీ బలం. దాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇకనుంచి వారానికి ఒకరోజు తప్పని సరిగా కేంద్ర పార్టీ కార్యాలయానికి వచ్చి పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనని నాయకుల వివరాలను సీఎం చంద్రబాబు తీసుకున్నారు. ప్రతినాయకుడి పనితీరును నమోదు చేస్తున్నామని,వారి వ్యవహారశైలి ఆధారంగానే భవిష్యత్తులో గుర్తింపు ఉంటుందన్నారు. ఈమధ్య కాలంలో తలెత్తిన వివాదాలపై క్రమశిక్షణా కమిటీ ఆయా నేతలతో మాట్లాడి వివరణ తీసుకుని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. "క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు. పార్టీ కోసం పనిచేసిన వారందరికీ పదవులు వస్తాయి. కష్టపడి పని చేసినవారికి పార్టీలో గుర్తింపు ఉంటుంది. నాయకులు పార్టీ పట్ల నిబద్ధతతో నడుచుకోవాలి" అని సీఎం హెచ్చరించారు.






**మధుర జ్ఞాపకం!**

## 393 అంబాసిడర్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం సీబీఎన్

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు దశాబ్దాల క్రితం ఉపయోగించిన అంబాసిడర్ కారును పరిశీలించి, ఆ కారుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 393 నెంబరుతో ఉండే అంబాసిడర్ కారు చంద్రబాబు నాయుడు సొంత వాహనం. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా 393 నెంబర్ ఉన్న అంబాసిడర్ కాన్వాయిలో ముఖ్యమంత్రి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించేవారు. 393 అంబాసిడర్ అంటేనే సీబీఎన్ బ్రాండ్ కార్ అనేలా ఈ కారు గుర్తింపు పొందింది. ప్రస్తుతం నాలుగోసారి సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు... భద్రతాపరంగా ఆధునిక వాహనాలు వినియోగిస్తున్నా... తన సొంత కారు అయిన నాటి అంబాసిడర్‌ను మాత్రం అపురూపంగానే చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాదులో ఉన్న ఈ కారును అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇకపై ఉంచనున్నారు. పార్టీ కార్యాలయానికి వచ్చి... తిరిగి వెళ్తున్న సమయంలో ఆనాడు తానువాడిన అంబాసిడర్ కారును చంద్రబాబు పరిశీలించి... ఆ కారులో తన ప్రయాణ స్మృతులను గుర్తు చేసుకున్నారు.





# చనుపల్లివారిగూడెం ఎస్సీ శ్మశాన వాటికకు ప్రహరీ

- ఉపముఖ్యమంత్రి పవన్ చొరవతో నిధులు మంజూరు
- వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం



అమరావతి (చైతన్యరథం): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో కృష్ణా జిల్లా చనుపల్లివారిగూడెం ఎస్సీ శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. ఈ నెల 23వ తేదీన పవన్ కళ్యాణ్ కొండపావులూరులోని ఎన్ఐడిఎంలో నిర్వహించిన ఓ అధికారిక కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో గన్నవరం మండలం, మాదలవారిగూడెం గ్రామ శివారు చనుపల్లివారిగూడెం గ్రామస్తులు తమ సమస్యను చెప్పుకొన్నారు. తమ గ్రామంలో ఉన్న ఎస్సీ శ్మశాన వాటికకు రక్షణ కరవయ్యిందని, ప్రహరీ గోడ లేక పోవడం వల్ల ఆక్రమణలు పెరిగిపోయాయని తెలిపారు. దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నాము. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాం. మా సమస్యకు పరిష్కారంచూపించాలని వినతి పత్రం అందజేశారు. దానిని పరిశీలించిన పవన్ కళ్యాణ్ వెంటనే శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్‌ని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి చొరవతో ఎస్సీ శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం పనులు తక్షణం ప్రారంభించేందుకు తొలి విడతగా రూ. 10 లక్షలు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. అదే రోజు వచ్చిన మరో అర్జీకి పరిష్కారం చూపుతూ ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి మరో రూ.10 లక్షలు విడుదల చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి ఈ నిధులు మంజూరు చేశారు. ఈ విజ్ఞాపనలపై వేగంగా స్పందించిన కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని ఉప ముఖ్యమంత్రి అభినందించారు.

# దెబ్బతిన్న రోడ్లు, పునర్నిర్మాణ వ్యయంపై సమగ్ర నివేదిక

- అధికారులకు మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశం



తూర్పు నాయుడుపాలెం (చైతన్యరథం): మొంథా తుఫాన్ దాటికి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, వాటి పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చుపై సమగ్ర నివేదిక రూపొందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. శుక్రవారం నాడు టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ అధికారులతో మంత్రిడీబీవీ స్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... మొంథా తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో పాడైపోయిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ఇతర రోడ్ల వివరాలు సేకరించి వాటి పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చుపై సమగ్ర నివేదిక అందించాలన్నారు. పూర్తిగా దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. పొలాలకు వెళ్లే డొంకరోడ్లు కూడా ఎంత మేర పాడయ్యాయో వివరాలు సేకరించి త్వరితగతిన నివేదిక అందజేయాలని అధికారులను మంత్రి డీబీవీ స్వామి ఆదేశించారు.

# తుపాను నష్టం.. రూ.5,244 కోట్లు

- మొంథా తుఫాను పరిణామాలపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక
- తక్షణం రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్రానికి వినతి
- ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలను కోరిన ఏపీ

అమరావతి (చైతన్య రథం): మొంథా తుఫాన్ నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్ర హోంశాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రాథమిక నివేదికను పంపారు. ఇప్పటివరకు ఉన్న అంచనాల ప్రకారం 17 శాఖలు, రంగాలకు సంబంధించి మొత్తం రూ.5,244 కోట్లు నష్టం వాటిల్లినట్టు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లింది. ప్రస్తుతం ప్రాథమిక అంచనాల ప్రకారమే నివేదిక సమర్పించామని, పూర్తిస్థాయిలో వివరాలు వస్తే నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రానికి తక్షణ ఆర్థికసాయం చేయాలని కేంద్రాన్ని కోరింది. ప్రాథమిక నివేదికలో అంశాలవారీగా ఏయే శాఖలు, ఏయే రంగాలవారీగా ఎంతమేర నష్టం వాటిల్లిందన్న సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొందుపర్చింది. అలాగే, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యలను పేర్కొంది. ఆర్టీజీఎస్ నుంచి తుఫాన్ ప్రభావాన్ని గమనిస్తూ ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు ప్రభుత్వం ఏవిధంగా తీసుకుందో వివరించింది. 19 జిల్లాలకు ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్టు తెలిపింది. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువుగా ఉందని నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలోని 249 మండలాల పరిధిలోని 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుఫాన్ ప్రభావం పడింది. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని స్పష్టం చేసింది. తుఫాన్‌వల్ల సంభవించిన నష్టాన్ని శాస్త్రీయంగా మదింపు చేసినట్టు పేర్కొంది. ఈమేరకు తుఫాన్ తీవ్రతను అద్దం పట్టేలా ఫోటోలను లేఖతో జతపరిచి... తుఫాన్ నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్రానికి కేంద్ర బృందాలను పంపాల్సిందిగా కోరింది.

## దెబ్బతిన్న 4,794 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లు

అధికారులు రూపొందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం... అత్యధికంగా రహదారులు, వ్యవసాయం-అనుబంధ రంగాల్లో నష్టం సంభవించినట్టు పేర్కొన్నారు. తుఫాన్‌వల్ల ముగ్గురు మరణించినట్టు నివేదికలో పొందుపర్చారు. 4,794 కి.మీ.మేర ఆర్ అండ్ బీ రహదారులు, 311 కల్వర్టులు- బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు. ఈ నష్టం రూ.2,774 కోట్లమేర ఉందని వివరించారు. 18 జిల్లాల్లోని 862 కి.మీ. మేర పంచాయతీ రాజ్ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఈ శాఖకు రూ.454 కోట్ల నష్టం వాటిల్లింది. 48 పట్టణ ప్రాంతాల్లోని రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక వసతులు విధ్వంసమయ్యాయి. వీటి పునరుద్ధరణకు రూ.109 కోట్లు వ్యయం కానుందని నివేదికలో పేర్కొన్నారు.

## 1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం

వ్యవసాయ రంగానికి సంబంధించి 1.38 లక్షల హెక్టార్లలోని 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయని... దీంతో రూ.829 కోట్ల వరకు రైతులు నష్టపోయినట్టు నివేదిక చెబుతోంది. మొత్తం 1.74 లక్షల మంది రైతులపై తుఫాన్ ప్రభావం చూపించింది. 12,215 హెక్టార్లలోని రూ.40 కోట్ల విలువైన ఉద్యానపంటలు దెబ్బతినగా 23,979 మంది ఉద్యాన రైతులకు నష్టం వాటిల్లింది. ఆక్వారంగంలో 32 వేల ఎకరాల్లోని రూ.514 కోట్ల విలువైన పంటను రైతులు కోల్పోయారు. మరోవైపు 2,261 పశు సంపదను నష్టపోయారు.

## విరిగిపడిన 2,817 విద్యుత్ స్తంభాలు

రాష్ట్రంలోని 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, 26,575 డీటీఆర్‌లు ధ్వంసమయ్యాయి. 429 కి.మీ. మేర విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీని వల్ల విద్యుత్ శాఖకు రూ.19 కోట్ల వరకు నష్టం జరిగింది. ఇక, రూ.234 కోట్ల మేర నష్టం నీటిపారుదల శాఖకు కలిగింది. అలాగే, 23 జిల్లాల పరిధిలోని 3,045 ఇళ్లు ధ్వంసమైనట్టు ప్రాథమిక నివేదికలో గుర్తించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, చేనేత మగ్గాలు అన్నీ కలిపి రూ.122 కోట్ల నష్టం వాటిల్లింది. మరోవైపు, 1,464 చోట్ల రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేయగా 1,36,907 మందికి పునరావాసం కల్పించారు. సహాయక చర్యల కోసం ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా రూ.32 కోట్లు ఖర్చు పెట్టినట్టు అధికారులు ప్రాథమిక నివేదికలో పొందుపర్చారు.



# టీడీపీ కేంద్ర కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

అమరావతి (చైతన్యరథం): భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని వేడుకలు శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి అశోక్ బాబు, శ్రీశైలం ఆలయ బోర్డు మెంబర్ ఏవీ రమణ, నేతలు పర్చూరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు, సమగ్రతకు అందించిన సేవలు చిరస్మరణీయమని, నేటి తరానికి ఆయన ఆశయాలు ఆదర్శనీయమని తెలిపారు.



# శ్రీసత్యసాయి జిల్లాలో నేడు సీఎం చంద్రబాబు పర్యటన

- ఏర్పాట్లపై మంత్రులు అనగాని, సవిత సమీక్ష

కదిరి (చైతన్యరథం): శ్రీసత్యసాయి జిల్లాలో శనివారం జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశించారు. జిల్లాలోని కదిరి నియోజకవర్గం తలుపుల మండలం పెద్దన్నగారి పల్లెలో.. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు సమీక్షించారు. హెలిపాడ్, ప్రజావేదిక బహిరంగ సభవద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్ల నిమిత్తం తీసుకున్న చర్యలను, భద్రతా ఏర్పాట్లను మంత్రులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ వివరించారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లన్నీ సమన్వయంతో పూర్తిచేసి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు మంత్రులు సూచించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం శుభకార్యాలకు హాజరయ్యారు. కంకిపాడులో చుక్కపల్లి మోహన్‌రావు కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులు సాయిసూర్య, అమర చరితలను ఆశీర్వదించారు. అనంతరం బీజేపీ నేత పాతూరి నాగభూషణం కుమారుడి ప్రీ వెడ్డింగ్ కార్యక్రమానికి హాజరై కాబోయే దంపతులు సాయికృష్ణ, విరజలకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.





## కుంచనపల్లిలో శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ

# పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవం

### - ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారా లోకేష్

తాడేపల్లి (చైతన్యరథం): మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామివార్ల ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవంలో శుక్రవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు.. గ్రామస్థులు, ఆలయ పునఃనిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు బాణసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆలయ పునఃనిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల ఆలయ పునర్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్యాదివాసంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా



శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.













ఢిల్లీలోని ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ కమారుడు రాజశేఖర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 22న శ్రీకాంత్ కుమారుడు రాజశేఖర్ వివాహం జరిగింది. ఆ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటనలో ఉండటంతో -వివాహ మహెూత్సవానికి హాజరుకాలేకపోయారు. దీంతో శుక్రవారం స్వయంగా విజయవాడలోని శ్రీకాంత్ నివాసానికి వెళ్లి.. రాజశేఖర్, సౌమ్యలను కలిశారు. నవ దంపతులను ఆశీర్వాదం అందించి.. వివాహ శుభకాంక్షలు తెలిపారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సీఎం చంద్రబాబు నాయుడు



## సుస్థిర జాతిశిల్పి పటేల్

అమరావతి (చైతన్య రథం): జాతీయ ఐక్యతకు పునాధి వేసిన సుస్థిర జాతిశిల్పి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. పటేల్ జయంతి సందర్భంగా ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "భారత రాజ్యాంగంలో పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించడమే కాదు, వాటిని కాపాడే బాధ్యత కూడానని బోధించిన మహనీయ దార్శనికుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్.

ఉక్కు సంకల్పంతో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, జాతీయ ఐక్యతకు పునాది వేసిన సుస్థిర జాతి శిల్పి ఆయన. దేశ సమగ్రతకు మార్గదర్శకుడైన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని ఆత్మకు నివాళి" అని పేర్కొన్నారు.

## ఉక్కు మనిషి పటేల్

**- మంత్రి లోకేష్ నివాళి**

అమరావతి (చైతన్యరథం): ఉక్కుమనిషి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఘన నివాళులు అర్పించారు. దేశ ఐక్యతకు కృషిచేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. దేశ తొలి హెూంమంత్రిగా, ఉప ప్రధానిగా విశేష సేవలు అందించారు. దృఢమైన సంకల్పం, అచంచల నాయకత్వం ఆయన సొంతం. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలను స్మరించుకుందామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.



### ప్రజాసేవ, సామాజిక ప్రభావంలో

# నారా భువనేశ్వరి కృషికి గుర్తింపు

- ప్రతిష్ఠాత్మక సంస్థ ఐఓడీ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు
- కార్పొరేట్ రంగంలోనూ దార్శనిక నాయకత్వానికి గోల్డెన్ పీకాక్ అవార్డు
- లండన్‌లో ఈ రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకోనున్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ భువనేశ్వరి



అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రజాసేవ- సామాజిక ప్రభావం అంశంలో చేసిన కృషికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. భారత్‌లోని ప్రముఖ సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) ఆమెను డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్- 2025 అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డుకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ప్రజా సేవ, సామాజిక ప్రభావం, నాయకత్వం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను ప్రతీ ఏటా ఈ అవార్డులకు ఐఓడీ ఎంపిక చేస్తుంది. 2025 ఏడాదికి గానూ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న నారా భువనేశ్వరికి ఇవ్వాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నిర్ణయించింది. నవంబర్ 4 తేదీన లండన్ లో జరిగే గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో నారా భువనేశ్వరి ఈ అవార్డును స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపార, సామాజిక, పరిపాలనా రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. ఇంతకు ముందు ఈ ప్రతిష్టాత్మక అవార్డును భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో-ఛైర్మన్ గోపీచంద్ హిందూజా, ఆదిత్య బిర్లా గ్రూప్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ఛైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు అందుకున్నారు. ఈ అవార్డుతో అలాంటి విశిష్ట వ్యక్తుల జాబితాలో ఇప్పుడు నారా భువనేశ్వరి చేరనున్నారు. ప్రస్తుతం ఆమె నేతృత్వం వహిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, విపత్తు సహాయం లాంటి అంశాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తోంది. ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, ఎన్టీఆర్ విద్యార్థి సహాయ పథకాలు, విపత్తు నిర్వహణ సేవలు, మహిళల ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందాయి. ప్రత్యేకించి తలసేమియా రోగులకు ఉచితంగా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్స్ నిర్వహించటంతో పాటు దీనిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజానికి చేరువైన సీఎం సతీమణి నారా భువనేశ్వరి ప్రజాసేవా పరాయణురాలైన నాయకురాలిగా పేరు తెచ్చుకున్నారు.

### హెరిటేజ్ ఫుడ్స్‌కు కార్పొరేట్ గవర్నెన్సు ఎక్సలెన్స్‌లో గోల్డెన్ పీకాక్ అవార్డు

నారా భువనేశ్వరి మహిళా నాయకత్వానికి స్ఫూర్తిగానూ నిలుస్తున్నారు. కార్పొరేట్ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్‌కు వైస్ చైర్‌పర్సన్, ఎండీగా ఉన్న ఆమె... ఆ సంస్థను పారదర్శకత, సామాజిక బాధ్యతతో నడిపిస్తున్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మక డెయిరీ బ్రాండ్‌గా హెరిటేజ్ సంస్థను తీర్చిదిద్దారు. సంస్థ ఎదుగుదల, నూతన ఉత్పత్తుల ఆవిష్కరణలతో పాటు కోట్ల మంది వినియోగదారులకు హెరిటేజ్ ఉత్పత్తులు చేరువ చేయటంలో నారా భువనేశ్వరిది కీలక పాత్ర. ప్రత్యేకించి హెరిటేజ్ ద్వారా రైతుల సాధికారతకు పెద్ద పీట వేస్తున్నారు. వాణిజ్య రంగంలో ఆమె అందిస్తున్న సేవలకుగానూ దేశంలోని అత్యంత శక్తివంతమైన మహిళా వ్యాపారవేత్తల్లో నారా భువనేశ్వరి ఒకరని 2013లోనే ఫార్చ్యూన్ ఇండియా పేర్కొంది. ఎఫ్ఎంసీజీ రంగంలో అత్యుత్తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్న హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్సెలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సు విభాగంలో దక్కిన గోల్డెన్ పీకాక్ అవార్డును ఆ సంస్థ వీసీఎండీ హెూదాలో నారా భువనేశ్వరి అందుకోనున్నారు. లండన్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఐఓడీ నుంచి ప్రతిష్టాత్మక అవార్డును ఆమె స్వీకరించనున్నారు.

### ప్రభుత్వ లక్ష్యాల మేరకు

# మైనింగ్ రంగం పనిచేయాలి

**- అధికారులతో సమీక్షలో మంత్రి రవీంద్ర**




అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో మైనింగ్ రంగం పని చేయాలని అధికారులకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మైనింగ్ రంగానికి విలువ ఆధారిత చర్యల ద్వారానే మరింత సంపద సృష్టి సాధ్యమవుతుందన్నారు. సచివాలయంలోని తన ఛాంబర్లో శుక్రవారం గనుల శాఖ అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్ కుమార్, డీఎంజీ డబ్ల్యూబీ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం మైనింగ్ రంగం ఆదాయం రూ.3,320 కోట్లుగా లక్ష్యం నిర్దేశించగా.. ఆక్టోబర్ వరకు రూ. 1,617 కోట్లు రావాల్సి ఉండగా రూ. 1,584 కోట్లు (98%) వచ్చిందన్నారు. మేజర్ మినరల్స్‌కు సంబంధించి రూ.570 కోట్లు లక్ష్యం కాగా రూ.404 కోట్లు (71%) సాధించారు. గత సంవత్సరం కంటే 18% తగ్గుదల నమోదయింది. మైనర్ మినరల్స్‌కు సంబంధించి రూ.1,047 కోట్లు లక్ష్యానికి మించి రూ.1,180 కోట్లు (112%) సాధించాం. గత సంవత్సరం కంటే 59% పెరుగుదల నమోదైంది. ఇతర వసూళ్లు (సెక్యూరిటీ, ఎంఎఫ్, ఎంఈఆర్‌టీ, ఎన్ఎంఈడీటీ): రూ.354 కోట్లు (93% సాధన) వచ్చాయన్నారు. మైనింగ్ లీజులకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను 30 నుంచి 45 రోజుల్లో పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. జరిమానాలకు సంబంధించి వన్ టైమ్ సెటిల్మెంట్ కింద 3,024 కేసులు (రూ.2,270 కోట్లు పెనాల్టీ) పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్ సెటిల్మెంట్ పోర్టల్ ద్వారా రూ. 90 కోట్లు వచ్చాయి. కొన్ని మైనింగ్‌లకు సంబంధించి వడ్డెర సంఘాలకు 15 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చేందుకు వీలవుతుందనేది ప్రభుత్వ ఆలోచన. సదరు కమిటీల అర్హతలను జిల్లా కమిటీలు నిర్ధారిస్తాయి.

ఇసుక తవ్వకాలకు సంబంధించి ఎంఓఈఎఫ్ అండ్ సీసీ మార్గదర్శకాలు ప్రకారం వర్షాకాలంలో తవ్వకాలు నిలిపివేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 172 పై చిలుకు స్టాక్ యార్డుల్లో 45 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉంది. ఇసుక అందుబాటు, ధరపై 60 నుంచి 75 శాతం ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు ప్రజాభిప్రాయ సర్వేలో వెల్లడయిందని మంత్రి రవీంద్ర తెలిపారు.

# శాస్త్రీయ విధానంలో పంట రక్షణ

- తుఫాన్ అనంతరం పంట నష్టం తగ్గింపుపై జేడీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు
- పంట రక్షణకు రైతులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపిన మంత్రి

అమరావతి (చైతన్యరథం): మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో, పంట రక్షణ చర్యలపై జాయింట్ డైరెక్టర్లతో శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్న తెలిపారు. దెబ్బతిన్న పంటకు సరైన సస్యరక్షణ చర్యలతో నష్టం తగ్గించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, గ్రౌండ్ వాటర్, మెట్రోలాజికల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి మండల వ్యవసాయాధికారి స్థాయిలో పంట నష్టం అంచనాలు కచ్చితంగా సేకరించి, రైతులకు తక్షణ ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో శాస్త్రవేత్తల సహాయంతో పంట రక్షణ పద్ధతులు అమలు చేయాలని సూచించారు. రైతుల సమస్యలు, నష్టాలపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక అందించాలని, వాటిని త్వరగా ప్రభుత్వానికి సమర్పించి సాయం అందించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతు భవిష్యత్తు మనకు ప్రాధాన్యం. ప్రతి ధాన్యపు గింజ విలువైనది. రైతుకు నష్టం రాకుండా ప్రతి అధికారి నిబద్ధతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లాలో పంట ముంపు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు.. పలువురు రైతులు తమ పంట నష్టం కింద నమోదు చేసుకుంటే ఆ పొలంలో పండిన వరి అమ్ముకోడానికి వీలవదని తనతో చెప్పుకున్నారని.. ఈ విషయమై వ్యవసాయశాఖ, సివిల్ సప్లయిస్ డిపార్ట్మెంట్ వాళ్లతో మాట్లాడి వారికి పూర్తిస్థాయిలో స్పష్టమైన సూచనలు ఇచ్చామన్నారు. గతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ రిలీఫ్ కింద పరిహారం తీసుకున్న అందరికీ ఈ ఇబ్బంది వచ్చింది.. కావున ఈ సారి ఆ ఇబ్బంది రాకుండా ఇరు శాఖలకు తగిన సూచనలు ఇచ్చామని మంత్రి తెలియజేశారు.



## రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మొంథా తుఫాను కారణంగా కృష్ణా, గోదావరి, తదితర జిల్లాల్లో వరి పంట పూత దశ, పాలు పోసుకునే దశ, కోత దశల్లో ఉండగా భారీ ఈదురుగాలులు, వర్షాల ప్రభావంతో అనేక వరి చేలు పడిపోయి నీట మునిగిన నేపథ్యంలో, నష్టం తీవ్రత తగ్గించేందుకు రైతులు అత్యవసరంగా కొన్ని కీలక చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. పూత దశ నుంచి పాలు పోసుకునే దశ వరకు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే అంతర్గత కాలువల ద్వారా తొలగించడం అత్యంత ముఖ్యం. నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 400 మి.లీ హెక్సాకోనాజోల్ లేదా 200 మి.లీ ప్రోపికోనాజోల్ పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందని సూచించారు. పరిస్థితులు అనుకూలిస్తే పడిపోయిన మొక్కలను పైకి లేపి కట్టుకోవాలి. అలాగే నిలబడి ఉన్నా, పడిపోయినా గింజలు రంగు మారకుండా, మాగుడు.. మానిపండు తెగుళ్లు వ్యాప్తి చెందకుండా ఎకరాకు 200 మి.లీ ప్రోపికోనాజోల్ తప్పనిసరిగా పిచికారీ చేయాలి. పాలు పోసుకునే దశలో ఉన్న పంటలకు కూడా ఇదే విధంగా నీటిని కాలువల ద్వారా తొలగించి మొక్కలను పైకి లేపడం కీలకం.

గింజ గట్టిపడే దశ, కోత దశలో చేలు నీట మునిగితే వెంటనే నీటిని బయటకు పంపాలి. కోత దశలో కంకిలో మొలకలు కనిపిస్తే, నీరు బయటకు తీసిన తర్వాత 5% ఉప్పు ద్రావణం (లీటరు నీటికి 50 గ్రా ఉప్పు) పిచికారీ చేయడం ద్వారా మొలక పడటం, రంగు మారడాన్ని తగ్గించవచ్చు. గింజ గట్టిపడే దశలో కూడా మొక్కలను పైకిలేపి కట్టుకోవడం, నీటిని వేగంగా తొలగించడం తప్పనిసరి. ఇప్పటికే కోసి కుప్పలుగా ఉన్న ధాన్యాన్ని వర్షం నుండి రక్షించేందుకు బరకాలు కప్పాలి. రెండు మూడు రోజులు ఎండబెట్టే అవకాశం లేకపోతే, కుప్పల్లో మొలక రాకుండా, రంగు మారకుండా ప్రతి క్వింటాకు 1 కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలపడం ద్వారా రక్షణ పొందవచ్చని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

# 98 శాతానికి పైగా విద్యుత్ పునరుద్ధరణ

- సీఎం చంద్రబాబు ముందు చూపుతో యంత్రాంగం అప్రమత్తం
- తుఫాన్ పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాల నిర్వహణ
- ప్రభుత్వంపై నిందలు మోపాలనేదే జగన్ దుష్ట పన్నాగం
- ఐదేళ్ల పాలనలో నిండా ముంచేసి నేడు అసత్య ప్రచారాలు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి (చైతన్యరథం): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే 98 శాతానికి పైగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుఫాను వచ్చే అవకాశం ఉందన్న ముందస్తు హెచ్చరికలు వెలువడినే వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రజా ప్రతినిధులు, ప్రజలతో పాటు అధికార యంత్రాంగం మొత్తాన్నీ అప్రమత్తం చేశారని మంత్రి వెల్లడించారు. మూడు డిస్కంల పరిధిలోని సుమారు 1500 మంది సిబ్బందిని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నియమించి ప్రత్యేక విధులు కేటాయించామని తెలిపారు.

విశాఖపట్నం, మచిలీపట్నం, బాపట్ల వంటి అత్యధిక తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులను నియమించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చేశామన్నారు. తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ఎప్పుడూ లేని విధంగా వైద్య శిబిరాలను నిర్వహించి బాధితులను కాపాడామని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

### 12, 500 పైగా కొత్త విద్యుత్ స్తంభాలు....

సముద్ర తీర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాలు, పట్టణాలలో 80 కిలోమీటర్లకు పైగా వేగంతో గాలులు వీచి చాలా విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయని, కండక్టర్లు డ్యామేజ్ అయ్యాయని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను కూడా అందుబాటులో ఉంచుకున్నామని చెప్పిన ఆయన, ధ్వంసం అయిన ప్రాంతాల్లో మొత్తం 12,500 విద్యుత్ స్తంభాలను కొత్తవి మార్చామని చెప్పారు. అదే విధంగా 2,900 కిలోమీటర్ల మేర కండక్టర్లను, సుమారు మూడు వేల వరకు ట్రాన్స్‌ఫార్మర్లను మార్పిడి చేశామని మంత్రి తెలిపారు. భారీ స్థాయిలో గాలులతో చెట్లు కూలి, స్తంభాలు విరిగిపోవడంతో నష్టం జరిగిందని తెలిపారు. సీఎం చంద్రబాబు ముందస్తు అప్రమత్తతతో రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా., 24 గంటల్లోనే తుఫాన్ ప్రభావం నుంచి బయట పడి సాధారణ స్థితికి వచ్చామని మంత్రి చెప్పారు. అత్యధిక వర్షపాతం నమోదు అయిన నెల్లూరు, కావలితో పాటు మచిలీపట్నం వంటి కొన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. పరిస్థితి అనుకూలించిన తరువాత సరఫరా పునరుద్ధరించామని తెలిపారు.



### సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంతో..

బాపట్ల, పర్చూరుతో పాటు మచిలీపట్నం వంటి కొన్ని ప్రాంతాల్లో సముద్రాన్ని తలపించే విధంగా నీరు నిలిచిపోయిందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. అయినా సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా బయట పడ్డామన్నారు. పునరావాస కేంద్రాల్లో మంచి ఆహారంతో పాటు వేడి నీళ్లు కూడా బాధితులకు అందించి వారికి అన్ని విధాలా బాసటగా నిలిచామని తెలిపారు. అదే విధంగా పంటలు నష్టపోయిన రైతులకు సత్వరమే పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి ధైర్యం చెప్పామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, ఆక్వా, అగ్రి కనెక్షన్లతో పాటు మిగిలిన అందరికీ 48 గంటల్లో విద్యుత్ సరఫరా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన కొన్ని ప్రాంతాల్లో స్థానికులతో పాటు కూటమి కార్యకర్తల సహాయ సహకారాలు తీసుకుని యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని మంత్రి గుర్తు చేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఆలోచనలకు అను గుణంగా చేసిన పని ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు.

### మట్టి అంటకుండా జగన్ రెడ్ కార్పెట్ పరామర్శలు...

ఐదేళ్లు అధికారం ఇచ్చిన ప్రజలను నిండా ముంచి సర్వనాశనం చేసిన జగన్మోహన్ రెడ్డికి.. రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గతంలో జగన్ తుఫాన్ పరామర్శలకు వెళ్లినప్పుడు కాళ్లకు మట్టి అంటకుండా కార్పెట్ వేయించుకుని నడవటం ప్రజలు మరచిపోలేదని ఎద్దేవా చేశారు. హుద్ హుద్ తుఫాను, బెజవాడ బుడమేరు వరదల సమయంలో సీఎం చంద్రబాబు ఎంత కష్టపడి పని చేశారో ప్రజలు స్వయంగా చూశారన్నారు. ప్రజలను దోచేసిన జగన్‌కు., పేదలకు సేవ చేసే చంద్రబాబుకు తేడాను అప్పుడే గమనించారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి కూడా జగన్‌కు కనబడటం లేదన్నారు. ప్రజల మన్ననలు పొందుతూ పని చేస్తున్న చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంపై నిందలు వేయాలనే ఆలోచనతో జగన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నాడని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు.

### ప్రాణాలకు తెగించి...

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు చెందిన వేలాది మంది ఉద్యోగులు రాత్రనకా, పగలనకా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారిని అభినందించారు. చాలా ప్రాంతాల్లో 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని ఆయన గుర్తు చేశారు. జోరు వానలో సైతం 48 గంటలు నిద్రాహారాలు మాని కర్తవ్య దీక్షలో మునిగిన అందరికీ హేట్స్ ఆఫ్ అంటూ మంత్రి ధన్యవాదాలు తెలిపారు. విపత్కర సమయంలోనూ విధులు నిర్వహించడం విధుల పట్ల వారికి ఉన్న అంకిత భావానికి నిదర్శమని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

# నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం

- కాకినాడ జిల్లా పరిధిలో పకడ్బందీగా పంట, ఆస్తి నష్టం అంచనాలు
- తీర ప్రాంత గ్రామాల రక్షణకు బృహత్ ప్రణాళిక
- ఏలేరు కాలువ గట్టు పటిష్టతకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు
- కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- తుపాను అనంతర ఉపశమన చర్యలపై దిశానిర్దేశం
- పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితిపై ఆరా

అమరావతి (చైతన్యరథం): కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ స్వాంతన కలిగించి, న్యాయం చేయాలని అధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలు పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి ప్రకటించిన సాయం అందేలా చూడాలని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. సముద్రానికి ఆనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశించారు. శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఆర్ఓ, ఆర్డీవోలు, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, వ్యవసాయ, విద్యుత్ శాఖలతోపాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాను అనంతర పరిస్థితులపై పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో జరిగిన నష్టం వివరాలపై ఆరా తీశారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తుపాను అనంతరం తీసుకుంటున్న ఉపశమన చర్యలు, ఆస్తి, పంట నష్టం అంచనాలపై దిశా నిర్దేశం చేశారు.

కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 21 మండలాలు, ఏడు మున్సిపాలిటీలు ప్రభావితం అయినట్టు కలెక్టర్ షాన్ మోహన్ వివరించారు. మొత్తం 61 ఇళ్లు దెబ్బ తినగా, 41,932 కుటుంబాలపై మొంథా ప్రభావం చూపినట్టు తెలిపారు. అందులో 27,624 మత్స్యకార, 313 చేనేత కుటుంబాలు ఉన్నట్టు చెప్పారు. 21, 711 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని, 668 ఎకరాల్లో అరటి, బొప్పాయి, తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. మొత్తం 33,596 మంది రైతులు తుపాను కారణంగా నష్టపోయినట్టు తెలిపారు. విద్యుత్ పరికరాలు, రోడ్లు కూడా పెద్ద ఎత్తున దెబ్బతిన్నట్టు వివరించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే వరి, ఉద్యాన పంటలు కలిపి 2,500 మంది రైతులు వరకు పంటలు నష్టపోయినట్టు చెప్పారు. అంతటా ఉపశమన చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

### పక్కాగా నష్టం అంచనాలు

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయానికి తుపాను బారినపడిందన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి రాకుండా పోయింది.



తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకీ ప్రభుత్వం నుంచి పరిహారం అందాలి. కష్టంలో ప్రభుత్వం మాకు తోడుందని రైతు సంతృప్తి చెందేలా యంత్రాంగం చర్యలు ఉండాలి. ముఖ్యంగా పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతుల పక్షాన నిలచి పక్కాగా నివేదికలు రూపొందించాలి. దీంతోపాటు ఆస్తి నష్టం వివరాలు కూడా రూపొందించాలి. దెబ్బ తిన్న ఇళ్లకు తక్షణం పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలి. తుపాను అనంతరం గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. గ్రామాల వారీగా పారిశుధ్య కార్యక్రమాలు ఎంత వరకు వచ్చాయో ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించండి. ఎంత మేర రోడ్లు దెబ్బతిన్నాయో గుర్తించి, పాక్షికంగా దెబ్బతిన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

### తీర ప్రాంతం మొత్తం తాత్కాలిక రాళ్ల గోడ

ఉప్పాడ తీర ప్రాంతంలోని సుబ్బంపేట వద్ద సముద్ర కోత నుంచి రక్షణకు రాళ్లతో తాత్కాలిక రక్షణ గోడ ఏర్పాటు చేశాం. ఇది సముద్రపు కోతను నిలువరించగలిగింది. మిగిలిన తీర ప్రాంత గ్రామాలకు కూడా ఈ రాళ్ల గోడ నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం. శాశ్వత రక్షణ గోడ నిర్మాణం పూర్తయ్యే వరకు ఇది తీర ప్రాంత గ్రామాలకు రక్షణ కల్పిస్తుంది. తీర ప్రాంత గ్రామాల రక్షణకి ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలని పవన్ చెప్పారు.

### పిఠాపురం నియోజక వర్గంలో పరిస్థితులపై సమీక్ష...

ఈ సందర్భంగా మొంథా తుపాను అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితులపై పవన్ కళ్యాణ్ సమీక్షించారు. కోతకు గురవుతున్న ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట, అమీనాబాద్, సుబ్బంపేటల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయని అధికారుల ద్వారా తెలుసున్నారు. మొంథా తుపాను పిఠాపురం నియోజక వర్గం మొత్తం ప్రభావం చూపింది.. తుపాను అనంతరం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీట మునిగినట్టు సమాచారం వచ్చింది. పిఠాపురం పట్టణం పరిధిలోని కరివేపాకు పేట ప్రాంతం వద్ద పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు ఇంకా నిలిచి ఉన్నట్టు తెలిసింది. ఆ నీటిని తక్షణం బయటికి పంపే ప్రయత్నం చేయాలి. దోమలు పెరిగి, వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలి అంటు వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్న చోట వైద్య శాఖను అప్రమత్తం చేయాలి. ఏలేరు కాలువ గొర్రెకండె గట్టు వద్ద కొంత బలహీనంగా ఉన్నట్టు తెలిసింది. ముంపు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన కాలువ గట్టు పటిష్టపరచండి. తుపాను కారణంగా మల్లవరం ప్రాంతంలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. పత్తి పంట నష్టంపై తక్షణం అంచనాలు రూపొందించి వారికి న్యాయం జరిగేలా చూడాలని అధికార యంత్రాంగానికి పవన్ దిశానిర్దేశం చేశారు.

# పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

- ప్రకాశం జిల్లాలో సజ్జ, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, మిరప, వరి, పెసర, పొగాకు పంటలకి నష్టం
- దెబ్బతిన్న రోడ్లు యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మిస్తాం
- తుఫాన్ సమయంలో కలెక్టర్ నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగుల వరకు అందరి సేవలు అభినందనీయం
- ప్రకృతి విపత్తును ముఖ్యమంత్రి తప్పిదమని మాట్లాడడం 11 సీట్ల పార్టీ నాయకుల నీచ రాజకీయాలకు నిదర్శనం
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించిన మంత్రి



మద్దిపూడి (చైతన్యరథం): మొంథా తుఫాన్ కారణంగా పంట దెబ్బతిని నష్ట పోయిన ప్రతి ఒక్క రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శు క్రవారం ఉదయం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం మద్దిపూడి మండల పరిధిలోని అంకేపల్లి, రాజుపాలెం గ్రామాల్లో మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలించి అధికారులు, రైతుల నుంచి మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా మొంథా తుఫాన్‌తో విపరీతంగా వర్షాలు కురవడంతో జిల్లాలో సాగు చేసిన 2,300 హెక్టార్లలోని సజ్జ, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, మిరప, వరి, పెసర, పొగాకు పంటలకి నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలను సమగ్రంగా సేకరించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. తుఫాన్ కారణంగా పాడైపోయిన రోడ్ల పునర్నిర్మాణ అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. అంచనాలు పూర్తయిన వెంటనే రోడ్లను పునర్నిమిస్తామన్నారు. తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడడంలో జిల్లా కలెక్టర్ నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగుల వరకు అందరి సేవలు అభినందనీయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తుఫాన్ విపత్కర పరిస్థితిలో కూడా వారి విధి నిర్వహణలో శక్తివంచన లేకుండా పనిచేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణ, ఆర్.టి.జి.ఎస్ నిర్వహణ మూలంగానే విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులను టెలి కాన్ఫరెన్స్ ద్వారా అప్రమత్తం చేస్తూ అధికారులతో ప్రజలకు సహాయక చర్యలలో అందుబాటులో ఉంచార న్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యవసర వస్తువులు సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పిదమని 11 సీట్ల పార్టీ నాయకులు మాట్లాడటం నీచ రాజకీయాలకు నిదర్శనం అని మంత్రి మండిపడ్డారు. విపత్కర పరిస్థితుల్లో సలహాలు, సూచనలు చేయవలసిన వైసీపీ రాజకీయ విమర్శలు చేస్తూ బురద చల్లడం సిగ్గుచేటని మంత్రి డా.స్వామి ధ్వజమెత్తారు.

# మైనారిటీలకు ఉచిత 'టెట్' కోచింగ్

- ఆన్ లైన్, ఆఫ్ లైన్ కోచింగ్‌కు ఏర్పాట్లు
- మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలి
- న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర విద్యా శాఖ నిర్వహించబోయే టెట్ పరీక్షకు హాజరయ్యే మైనారిటీ యువతకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ అఫ్ మైనారిటీస్ (సిఈడియం) ద్వారా మైనారిటీలకు ఉచిత కోచింగ్ అందిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. విద్యా శాఖ ఈ ఏడాది డిసెంబర్ 10న టెట్ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. టెట్ పరీక్షలకు నవంబర్ మొదటి వారం నుండి మైనారిటీ యువతకు ఉచితంగా కోచింగ్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. టెట్ పరీక్ష కోసం కోచింగ్‌ను ఆన్ లైన్ తో పాటు ఆఫ్ లైన్ ద్వారా కూడా అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ అవకాశాన్ని మైనారిటీ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. పూర్తి వివరాల కోసం సిఈడియం వెబ్ సైట్ ౘ౗.ఖజాౘఎ఑ఎ.శీతీ్ద ద్వారా టెట్ పరీక్షకు సన్నద్ధమయ్యే మైనారిటీ యువత తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం విజయవాడ భవానీపురంలోని సిఈడియం కార్యాలయాన్ని, 0866-2970567, 7386789966 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా పాండురంగ స్వామి ఉత్సవాలు

- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి
- సతీసమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ



మచిలీపట్నం (చైతన్యరథం): కార్తీక శుద్ధ ఏకాదశి మహెూత్సవం సందర్భంగా మచిలీపట్నం చిలకలపూడిలో వేంచేసి ఉన్న శ్రీ పాండురంగ స్వామి వారికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం సతీ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ పండరీపురం తర్వాత మచిలీపట్నంలో మాత్రమే పాండురంగ స్వామి వారికి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 1929లో భక్త నరసింహం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో పాండురంగ స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగిందని, నాటి నుండి ఎంతో వైభవోపేతంగా ఉత్సవాలు నిర్వహించినా.. 50 ఏళ్ల క్రితం ఉత్సవాలను నిలిపివేశారు. 2014లో మళ్ళీ ఉత్సవాలను పునః ప్రారంభించాం. ఈ ఉత్సవాలను భక్తులు దిగ్విజయం చేయాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 1 న కళ్యాణం, 2న రథోత్సవం, 3న తెప్పోత్సవం, 4న సాంస్కృతిక కార్యక్రమాలు, 5న సముద్రునికి హారతులిచ్చి పవిత్ర సముద్ర స్నానాలు జరుగుతాయన్నారు. పోలీస్, రెవెన్యూ, శానిటేషన్ సహా అన్ని విభాగాల సమన్వయంతో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నామన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని, ఉత్సవాలను ప్రజలంతా దిగ్విజయం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.

# అసత్య కథనాల కట్టడికి పోలీసుశాఖ చర్యలు

- 10 వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లకు నోటీసులు
- వీరిలో కొంత మందిపై గతంలో దొంగతనం, చీటింగ్ కేసులు
- వేలిముద్రలు చెక్ చేసి వివరాల సేకరణకు పోలీసు యంత్రాగం ఆదేశాలు

అమరావతి (చైతన్యరథం): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాల కట్టడికి పోలీస్ శాఖ నడుం బిగించింది. వాట్సాప్ గ్రూపుల్లో పోలీసు అధికారులను, సిబ్బందిని సభ్యులుగా చేర్చుకుని, అసత్య కథనాలు పోస్టు చేస్తూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో.. పోలీస్ శాఖ చర్యలకు సిద్ధమైంది. సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు సృష్టించి పోస్ట్ చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసినా అందుకు గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా 15 వాట్సాప్ గ్రూపులను గుర్తించారు. ముందుగా 10 క్రైమ్ గ్రూపుల అడ్మిన్‌లకు నోటీసులు ఇవ్వాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. వారు నివాసం ఉండే పరిధిలోని పోలీస్ స్టేషన్ల నుంచి వారికి పిలుపు వచ్చింది. స్టేషన్‌కు వచ్చి నోటీసులు తీసుకోవాలని సూచించారు. గుంటూరు నగరంలోని లాలాపేట స్టేషన్ పరిధిలో ఉన్న నాలుగు గ్రూప్‌ల అడ్మిన్లకు నోటీసులు సిద్ధం చేసి.. వాటిని తీసుకోవాలని ఫోన్లు చేసి చెప్పారు. వీరిలో కొంత మందిపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం, చీటింగ్ కేసులు ఉన్నట్లు సమాచారం. వీరి వేలిముద్రలు చెక్ చేసి వివరాలు సేకరించాలని పోలీసు యంత్రాగానికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలాగే అరండల్ పేట, నగరంపాలెం, పెదకాకానితో పాటు పొన్నూరు టౌన్‌కు చెందిన అడ్మిన్లు, మరో రెండు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల అడ్మిన్లు కూడా ఉన్నారు. వారికి కూడా నోటీసులు ఇవ్వనున్నారు. రెండో దఫా కూడా మరికొన్ని గ్రూపులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. అలాగే యూ ట్యూబ్ చానళ్ల పేరుతో.. పోలీసులను, వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న ఘటనలపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. కొందరు ఏకంగా జిల్లా పోలీస్ కార్యాలయానికే వచ్చి బాధితులను డబ్బు డిమాండ్ చేస్తున్న విషయం కూడా పోలీసు అధికారుల దృష్టికి వచ్చింది.

# చర్చలు సఫలం.. ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణ

- మంత్రి సత్యకుమార్, అశా ప్రతినిధుల మధ్య చర్చలు ఫలవంతం
- మూడో విడత కింద రూ.250 కోట్లు విడుదలకు అంగీకారం
- వన్ టైం కింద మొత్తం బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం సంసిద్ధత




అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావటంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణకు ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్ అసోసియేషన్ (అశా) అంగీకరించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ అశా ప్రతినిధుల మధ్య శుక్రవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. వీరి ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి మంత్రి చూపిన చొరవతో వైద్య సేవలను తక్షణమే కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి హామీ ఇవ్వడంతో పాటు పత్రికా ప్రకటన జారీ చేశారు.

రాష్ట్ర సచివాలయంలోని మంత్రి సత్యకుమార్ ఛాంబరులో మంత్రి, అసోసియేషన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ప్రభుత్వ బకాయిలను వన్ టైం కింద చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమస్యల పరిష్కారం గురించి ఎప్పటికప్పుడు చర్చించాను. వన్ టైం చెల్లింపు విధానంలో సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎం సిద్ధంగా ఉన్నారు. వన్ టైం చెల్లింపు విధానం అమల్లోకొచ్చేలోగా మరో రూ.250 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటా. యూనివర్శల్ హెల్త్ పాలసీ కింద తీసుకునే నిర్ణయాల్లో సంఘం ప్రతినిధులను భాగస్వాములను చేస్తా. పెండింగులో ఉన్న ఆసుపత్రుల బిల్లుల పరిశీలనలకు యుద్ధప్రతిపాదికన సుమారు 50 మంది వైద్యులను నియమిస్తున్నాం. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున రోగుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని వెంటనే వైద్య సేవలను కొనసాగించాలని మంత్రి కోరారు.

### 2 విడతల్లో ఇప్పటికే రూ.488 కోట్లు చెల్లింపు

బకాయిలను వెంటనే వెల్లించాలని కోరుతూ అక్టోబరు 10 నుంచి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు సేవలు నిలిపివేశాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు మంత్రి సత్యకుమార్ చొరవతో ప్రభుత్వం రెండు విడతల్లో కలిపి రూ.488 కోట్లు విడుదలచేసింది. మరో విడత కింద రూ.250 కోట్లు చెల్లించేందుకు చర్యలు మొదలయ్యాయి. మిగిలిన బకాయిలను నెట్‌వర్క్ ఆసుపత్రులకు బ్యాంకుల నుండి రుణం తీసుకుని ద్వారా వన్ టైం విధానంలో చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### కూటమి ప్రభుత్వం చెల్లించిన మొత్తం రూ. 4,143 కోట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పట్నించి ఇప్పటివరకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు తరపున ఆసుపత్రులకు రూ. 4,143 కోట్లు చెల్లింపులు జరిగాయి. ఇందులో గత వైకాపా ప్రభుత్వ బకాయిలు రూ.2,403.92 కోట్లున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వం హయంలో ట్రస్టు ద్వారా జరిగిన వైద్య సేవలకైన మొత్తంలో రూ.1739.28 కోట్లు చెల్లించింది. ప్రస్తుతానికి చెల్లించాల్సిన బకాయిల విలువ రూ.2,500 కోట్ల వరకు ఉంది. మంత్రితో ఆశా ప్రతినిధులు జరిపిన చర్చల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సిఇఓ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక యవనికపై ఏపీని నిలబెడతాం

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటన
- నవంబర్ 4 నుండి 6 వరకు లండన్‌లో మంత్రి పర్యటన
- వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం) - 2025 సమావేశంలో పాల్గొననున్న మంత్రి
- రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



అమరావతి (చైతన్యరథం): ప్రపంచ పర్యాటక యవనికపై ఏపీని నిలబెడుతామని మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటించారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని పరిచయం చేయడంతోపాటు రాష్ట్రాన్ని ప్రపంచపర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి కందుల దుర్గేష్ నవంబర్ 4 నుండి 6 వరకు లండన్‌లో పర్యటించనున్నారు. సుస్థిర పర్యాటక రంగ వృద్ధి, డిజిటలైజేషన్, ఇన్ బౌండ్ టూరిజంను మెరుగుపరిచే ఉద్దేశంతో మూడు రోజులపాటు లండన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)-2025 సమావేశంలో మంత్రి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా లండన్‌లో 30 మంది ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించనున్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను, విప్లవాత్మక నిర్ణయాలను వెల్లడించి అక్కడికి వచ్చే ఇన్వెస్టర్లను ఆకర్షించనున్నారు. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ వేదికగా ఏపీ స్టాల్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అద్భుతమైన సహజ సిద్ధ ప్రదేశాలు, చరిత్ర, వారసత్వ సంపదను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిపేలా ప్రచారం చేయనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాల ఛాయాచిత్రాల ప్రదర్శనను ప్రదర్శించనున్నారు. అంతేగాక ఏపీ బృందంతో పాటు ప్రఖ్యాత స్టేక్ హెూల్డర్స్‌ను, ట్రావెల్ ఆపరేటర్లను తీసుకెళ్లనున్నారు. అక్కడికి వచ్చే ప్రతినిధులకు కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి, అరకు కాఫీని, ఆంధ్రా ఫేమస్ పూతరేకుల రుచి చూపించడంతో పాటు జీఐ ట్యాగ్ పొందిన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను బహుమతిగా అందించనున్నారు.

### అంతర్జాతీయ స్థాయి గుర్తింపు..

లండన్ పర్యటనలో భాగంగా పలు దేశాల్లో పర్యాటక రంగం ఎలా అభివృద్ధి చెందుతున్నదో అధ్యయనం చేసి ఏపీ పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధికి తీసు కుంటున్న చర్యలను వరల్డ్ ట్రావెల్‌మార్కెట్ వేదికగా వినిపించి ఏపీ పర్యాటక రంగాన్ని సరికొత్తగా పరిచయం చేస్తామన్నారు. ఏపీ పర్యాటక రంగాన్ని విశ్వవ్యాప్తం చేయడం వల్ల విదేశీ పర్యాటకుల తాకిడిపెరిగి పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని, తద్వారా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయని భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. అన్ని రాష్ట్రాల, పలుదేశాల పర్యాటక బోర్డులు, అంతర్జాతీయ విమానయాన సంస్థలు, గ్లోబల్ హాస్పిటాలిటీ బ్రాండ్లు, టూర్ ఆపరేటర్లు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీలు తదితర ఇన్వెస్టర్లను ఒకచోట చేర్చే వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ప్రదర్శన ద్వారా ఏపీ పర్యాటక వాణిని వినిపించి వినూత్న పెట్టుబడులు ఆకర్షిస్తామని మంత్రి దుర్గేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు పర్యాటకశాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ పాల్గొననున్నారు. మంత్రి కందుల దుర్గేష్‌ను వరల్డ్ ట్రావెల్ మార్కెట్-2025లో పాల్గొనేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో నవంబర్ 2వ తేదీన లండన్ పర్యటనకు బయలుదేరనున్నారు.

# విపత్తు వేళ బాధ్యతలేని విమర్శలు

- విధ్వంసం కోరుకునే మనస్తత్వం జగన్‌ది
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధ్వజం
- సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే నష్టాన్ని తగ్గించగలిగాం
- ప్రభుత్వ అప్రమత్తత, నిరంతర పర్యవేక్షణ వల్లే ఇది సాధ్యమయింది



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడం, అధికార యంత్రాంగాన్ని సకాలంలో అప్రమత్తం చేయడం వలనే ప్రాణ నష్టాన్ని తగ్గించగలిమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారిని వెంటనే గుర్తించి, పునరావాస శిబిరాలకు తరలించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం, సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షణకు నియమించడం, ముఖ్యమంత్రి నిరంతరం సమీక్షలు నిర్వహించడం వల్ల అధికార యంత్రాంగం వెంటనే స్పందించిందని పేర్కొన్నారు. నెల్లూరులోని సంగం బ్యారేజీ వద్ద బోటు ఇరుక్కుపోవడం వంటి సంఘటనలను కూడా అధికారులు తక్షణమే పరిష్కరించారని, ఎన్డీఆర్ఎఫ్ సహకారంతో వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురాగలిగామని వివరించారు. ఈ విజయం మొత్తం ప్రభుత్వ అప్రమత్తత, నిరంతర పర్యవేక్షణ వల్లే సాధ్యమైందని స్పష్టం చేశారు.

### జగన్‌ది బాధ్యతా రాహిత్యం

ఇటువంటి ఆపద సమయంలో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా ఉండాల్సిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అందుకు విరుద్ధంగా బాధ్యతా రహితంగా చేసిన విమర్శలు చాలా బాధ కలిగిస్తున్నాయన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎన్నో తుపానులు వచ్చినా, వేలాది ఎకరాల పంట నష్టం జరిగినా ఆయన ఎప్పుడూ పంట చేలో కనీసం కాలుకూడా పెట్టలేదని గుర్తు చేశారు.అధికారం పోయాక బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని సమీక్షలు జరిపి తుపాను రావడం ప్రభుత్వ వైఫల్యం వల్లేనని చెప్పడం జగన్ ఆలోచనా రాహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. తుపానులు ఎవరికీ చెప్పి రావని, వాటిని ఆపడం ప్రభుత్వాల వల్ల, మనుషుల వల్ల సాధ్యం కాదన్నారు కాకపోతే తుపాను వల్ల జరిగే ప్రాణ నష్టాన్ని ఆపడం, ప్రజలను అప్రమత్తం చేసి పునరావాసం కల్పించడం వంటివి మాత్రమే ప్రభుత్వాలు చేయగలవని తెలిపారు. జగన్ కేవలం రాజకీయ కోణంలోనే మాట్లాడుతున్నారని, ప్రభుత్వంపై నిరంతరం బురద జల్లి రాజకీయ ప్రయోజనం పొందాలనే ఆలోచన తప్ప, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన ఆయనకు లేదని ధూళిపాళ్ల విమర్శించారు.

### ప్రతి ఎకరాకు పరిహారం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి వారికి మనోధైర్యాన్ని ఇవ్వడం గతంలోనూ చూశామని తెలిపారు. గతంలో పంట నష్టం జరిగితే వారం రోజుల్లోనే పరిహారం రైతుల అకౌంట్లలో జమ చేశామని, ఈ సారి కూడా పంట నష్టం వివరాలు సేకరించి త్వరలోనే నష్టపరిహారం చెల్లించడానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ముందస్తుగా పునరావాస శిబిరాలకు తరలించిన వారికి తక్షణ సాయంగా రూ. 3,000, నిత్యావసర వస్తువులు ఇచ్చామని తెలిపారు. జగన్ హయాంలో పంట నష్టం జరిగినా కొన్న ధాన్యానికి కూడా నెలల తరబడి డబ్బులు ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 1,100 కోట్లు రైతుల అకౌంట్లలో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతాంగం కోసం పనిచేసే ప్రభుత్వమని, ఇన్సూరెన్స్ కట్టినా కట్టకపోయినా నష్టపోయిన ప్రతి ఎకరాకు పరిహారం ఇస్తామని, నష్టపోయిన పంటను కొంటామని హామీ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డికి విధ్వంసం చేయడం అలవాటు అయిపోయి.. విధ్వంసం జరిగితే ఆనందించాలనే మనస్తత్వం కనిపిస్తోందని ఆక్షేపించారు. జగన్ ఐదేళ్లలో చేసిందంతా విధ్వంస పాలనే.. కానీ నేడు కూటమి ప్రభుత్వం ప్రజల కష్టాలను తెలుసుకొని వారికి మనోధైర్యాన్ని ఇచ్చి వారిని ఆదుకుంటుందని దూళిపాళ్ల స్పష్టం చేశారు.

# విపత్తులు ఎదుర్కోవడంలో సమర్థుడు చంద్రబాబు!

విపత్తులను ఎదుర్కోవడంలో దేశవ్యాప్తంగా చంద్రబాబుని మించిన నాయకుడు లేరు. తుపానులరూపంలో సముద్రం చేసే విధ్వంసం కాచుకోవడం కొత్తకాదు.. కోస్తాతీరంలోని ప్రజలకి, ప్రజానేత చంద్రబాబుకి. విలయాలను ఎదుర్కోవడంలో, ప్రజలను సత్వరం ఆదుకోవడంలో చంద్రబాబు దేశానికే ఆదర్శం, సందేహం లేదు. 1996లో హరికేన్ పెనుతుఫాను మొదలుకొని.. ఏపీ తీరాన్ని బలంగా తాకిన హుద్‌హుద్, తిత్లీ, పెథాయి.. ఇప్పుడు మొంథా వరకూ –రాష్ట్రానికి రక్షణ కవచం నిర్మించడంలో చంద్రబాబు సమర్థత అనన్యసామాన్యం. అంతేకాదు అటు ఉత్తరాఖండ్ వరద బాధితుల నుంచి ఒడిశాలో సూపర్ సైక్లోన్ బాధితలకు ఆపన్నహస్తం అందించిన చంద్రబాబు సహృదయాన్ని తక్కువ చేయలేం. వరదలు, అకాల వర్షాలు.. రాష్ట్రానికి ఏ ఆపద వచ్చినా.. రైతులు, రాష్ట్ర ప్రజలను కాపాడుకోవడానికి చంద్రన్న ధైర్యసాహసాలు, రాజకీయ అనుభవం అపారమే.

వాతావరణం సహకరించక పోయినా విపత్తుకన్నా వేగంగా స్పందించడం ఆయన తత్వం. 1996 కోనసీమ హరికేన్ తుఫాను సమయంలో 8 రోజులుపాటు ఆర్డీవో ఆఫీసులోవుండి తుపాను బాధితులను ఆదుకున్నారు. తర్వాత ఒడిశాలో సూపర్ సైక్లోన్ విరుచుకు పడిన సమయంలోనూ ఏపీ విద్యుత్ ఉద్యోగులను పంపి వ్యవస్థను పునరుద్ధరించి ఒడిశా తుపాను బాధితులను ఆదుకున్నారు. 2014లో విశాఖలో హుద్‌హుద్ తుఫాన్ సృష్టించిన భీభత్సం కనీవినీ ఎరుగనిది. తుఫాన్ మధ్యలోనే తుఫాన్‌కన్నా వేగంగా స్పందించి తెల్లారేపాటికి విశాఖ వీధుల్లో జనమధ్య నిలిచి 10 రోజులుపాటు బస్సునుంచే ప్రభుత్వాన్ని నడిపిస్తూ.. నిర్విరామంగా శ్రమించి కకావికలమైన విశాఖను, బాధితులను ఆదుకున్న విధానం దేశమంతా చూసిందే. తర్వాత తిత్లీ రాకాసి తుఫాను శ్రీకాకుళం జిల్లాను కకావికలం చేసింది. తిత్లీ తుఫాన్‌తో ఏళ్లతరబడి పెరిగిన కొబ్బరి, జీడిమామిడి తోటలు నేలమట్టమై అపారనష్టం వాటిల్లింది. విద్యుత్ వ్యవస్థ కుప్పకూలి. దాదాపు 36వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈవిధంగా గడప గడపలో విషాదం మిగిల్చింది తుఫాన్. నేనున్నా.. అధైర్యపడొద్దు అంటూ ప్రజలకు ఆదుకోవడానికి పరుగులు తీశారు చంద్రబాబు.

తీవ్రమైన తిత్లీ తుఫాన్ ఉత్తరాంధ్రపై విరుచుకుపడుతుందన్న సమాచారం అందిన క్షణంనుండి సీఎంగా చంద్రబాబు కంటిపై కునుకులేకుండా తెల్లవార్లూ టెలీకాన్ఫరెన్సులు నిర్వహించి.. నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా చూడాలంటూ సమీక్షల మీద సమీక్షలు నిర్వహించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, తాగునీరు అందించారు. తుపాను ఎదుర్కోవడానికి రాజధానిలో కూర్చొని అయినా సహాయ చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేయవచ్చు. సమీక్షలు జరపవచ్చు. నష్ట పరిహారం భారీగా ప్రకటించవచ్చు. అన్నీ కుదురుకున్నాక మొక్కుబడి పరామర్శలు చేసి ఆదుకుంటామని హామీలివ్వొచ్చు. కానీ –అందరిలాంటి ప్రజానేత కాదు చంద్రబాబు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను పరామర్శించి వారిని ఓదార్చేందుకు ప్రజలవద్దకు మోకాలి లోతు నీళ్లలో నడుస్తూ వెళ్లారు. ప్రజల బాధలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆదుకుంటాను, అధైర్యపడకండి అంటూ యంత్రాంగాన్ని, 15మంది మంత్రులను జిల్లాకురప్పించి తిత్లీ బాధితులను ఆదుకున్నారు. పెథాయి ప్రళయ భీకర తుఫాను రాష్ట్రంపై విరుచుకు పడితే సాంకేతిక సన్నద్ధత, అప్రమత్తతతో తుపానుపై చంద్రబాబు ప్రభుత్వం యుద్ధమే చేసింది. రాష్ట్రానికి పెను నష్టం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకుని విజయం సాధించింది. తర్వాత బుడమేరు వరద సృష్టించిన విలయం విజయవాడలో విషాదం మిగిలిస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగమేఘాలమీద స్పందించారు. తానే స్వయంగా రంగంలోకి దిగి 75ఏళ్ల వయసులో వరదనీటిలో అర్ధరాత్రి బోటుపై భాధితులను చేరుకున్నారు. వాళ్లకు ధైర్యం చెబుతూ.. ఆహార పొట్లాలు అందించారు. అధైర్య పడొద్దని భాదితులకు భరోసానివ్వడం అసాధారణం.

### సీఎం చంద్రబాబుకు అభినందనలు

నేడు మొంథా తుఫాను రాష్ట్రంపై విరుచుకు పడుతుందన్న సమాచారం అందిన క్షణంనుండి సీఎం చంద్రబాబు అర్థరాత్రి 12:20 వరకూ కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్సులు నిర్వహిస్తూ నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తుఫాన్‌వల్ల ప్రజలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకున్నారు. లక్షలాది ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆధునిక సాంకేతిక హెచ్చరికల వ్యవస్థల ద్వారా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా చూసిన ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందించి తీరాలి. ఏ ప్రభుత్వం తుపాను నష్టాన్ని అడ్డుకోలేదు. కాని అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని, తుపాను దశ దిశను ఎప్పటికప్పుడు అంచనా వేసి నష్టాన్ని నివారించవచ్చని సీఎం చంద్రబాబు నిరూపించారు. కలెక్టర్లు, అధికారులతో రియల్ టైమ్ మానిటరింగ్ చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని టీమ్ అహర్నిశలు శ్రమించి ప్రాణనష్టాన్ని నివారించింది. యుద్ధప్రాతిపదికన విద్యుత్‌ను పునరుద్ధరించి.. రహదార్లు, డ్రెయిన్లను క్లియర్ చేసే పనులు గంటల వ్యవధిలో పూర్తి చేశారు.

### రాష్ట్రానికి జగనే ఒక విపత్తు

రాష్ట్రానికి విపత్తుగా పరిణమించిన జగన్‌రెడ్డి, విషాదంలోనూ ప్రభుత్వంపై బురద చల్లుతూ.. అసత్య ప్రచారాలు, వికృత వ్యాఖ్యలకు తెగబడటం దారుణం, దుర్మార్గం, అమానుషం. జగన్ విమర్శలకు హద్దంటూ లేకపోవడం విచారకరం. ప్రకృతి విషాదాలపైనా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం జగన్ నీచ రాజకీయానికి నిదర్శనం. జగన్ ప్రభుత్వం పంటల బీమాకు ప్రీమియం చెల్లించకుండా గుండు సున్నా చుట్టిందని కేంద్రమే లోక్‌సభ సాక్షిగా స్పష్టంగా తెలిపింది. అయినా తానేదో ఉచిత పంటల బీమాను గొప్పగా అమలుచేస్తే.. చంద్రబాబు దానిని నిర్వీర్యం చేసారన్న అసత్య ప్రచారాలకు సాహసించడం జగన్ దగా రాజకీయాలకు పరాకాష్ట. సీఎం కాకున్నా మొంథా తుఫాన్‌నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడినంటూ సిగ్గుమాలిన ప్రగల్భాలకు తెగబడటం జగన్‌కే చెల్లింది. జగన్ సీఎంగా ఉన్నపుడే ప్రకృతి వైపరీత్యాల సమయంలో గడప దాటింది లేదు. అంతకుముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ హైదరాబాద్‌లో నివాసానికే జగన్ పరిమితమయ్యారు. పంట నష్టపోయిన రైతుల వద్దకు ఏనాడూ వెళ్లింది లేదు. జగన్ హయాంలో ప్రకృతి విపత్తు సంభవించినపుడు.. దెబ్బతిన్న వరిచేలను చూసేందుకు ప్రత్యేకంగా స్టేజీ సెటప్ వేయించుకోవడం జగన్‌కే చెల్లింది. ఆయన తీరు అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

జగన్ హయాంలో విపత్తులు విరుచుకుపడి ప్రజలు ఎంత నష్టపోయినా, పంటలు నీట మునిగి రైతులు రోధిస్తున్నా.. తాడేపల్లి ప్యాలెస్‌నుంచి తల బయటకు పెట్టింది లేదు. తుపానులకు దెబ్బతిన్న పంటలను పొలంలోకివెళ్లి పరిశీలించిన పరిస్థితీ లేదు. రైతులు దిక్కుతోచని స్థితిలోవుంటే.. జగన్ మొక్కుబడిగా ఏరియల్ సర్వే చేసి వెళ్లిపోయారు. 2023 వైపరీత్యంతో.. రైతుల కష్టం నీళ్ళలో కుళ్లుతుంటే.. జగన్‌రెడ్డికి రెడ్ కార్పెట్ స్వాగతం కావాల్సివచ్చింది. అంతకుముందు 2021 నవంబరు 21న అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి ఊళ్లకు ఊళ్లే తుడిచిపెట్టుకుపోయాయి. భారీగా ప్రాణనష్టం సంభవించింది. అప్పుడు కూడా సీఎంగా జగన్‌రెడ్డి మొక్కుబడి పరామర్శలు చేశారు. ఇప్పుడు మొంథా తుఫానుతో రాష్ట్రం అతలాకుతలమైపోతుంటే జగన్‌రెడ్డి అడ్రస్ ఎక్కడా కనిపించలేదు. జగన్ రోత మీడియా మాత్రం వికృతంగా విషపు రాతలు రాస్తుంది. బురద రాజకీయం చేసి బతకాలనుకోవడం వైసీపీ గతిమాలిన రాజకీయాలకు నిదర్శనం. రోత పత్రిక ఎన్ని రోత రాతలు రాసినా.. ఆపద సమయంలో అండగా నిలిచిందవరో గ్రహించలేనంత అమాయకులు కాదు ప్రజలు. మొన్నటి ఎన్నికలలోనే ప్రజలు బండకేసి బాదినా.. జగన్‌కు బుద్ధి రావడంలేదు!

- నీరుకొండ ప్రసాద్





# ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్

## 150వ జయంతి సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు

విజయనగరం, (చైతన్యరథం): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ బ్యారెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు పాల్గొన్న విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు. ఈ సందర్భంగా పోలీస్ బ్యారెక్స్ వద్ద గల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు, అనంతరం ఐక్యతా ర్యాలీని పోలీస్ బ్యారెక్స్ నుండి ప్రారంభించి పట్టంలోని బాలాజీ జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్వి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ పాల్గొన్నారు.

# తుపానుతో గోడకూలి మహిళ మృతి



## ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పరామర్శ

విజయనగరం పట్టణం 38వ డివిజన్ గోకపేట లో గోడ కూలడం వలన రెయ్యి సన్యాసమ్మ (74 సంవత్సరాలు) అనే మహిళ మరణించారు, విషయం తెలుసుకున్న విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అదేవిధంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తానున్నానని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

# తుపాను బాధితులకు న్యాయం చేస్తాం

## ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి హామీ

విజయనగరం, (చైతన్యరథం): “మొంథా తుఫాన్” కారణంగా విజయనగరం మండలం కొండకరకాం గ్రామంలో దెబ్బతిన్న వరి పంట పొలాలను ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. విజయనగరం పట్టణం, 11వ డివిజన్ పరిధిలో గల అశోక్ నగర్ లో తుఫాన్ కారణంగా దెబ్బతిని కూలిపోయిన 10 ఇళ్ళను పరిశీలించారు, తదుపరి బాధితులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ శ్రీమతి పాలవలస యశస్వి పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం

## రీసైక్లింగ్ యూనిట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర



పార్వతీపురం, (చైతన్యరథం): ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపినట్లు పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. డంపింగ్ యార్డ్ వద్ద వ్యర్థాన్ని రీసైక్లింగ్ చేసే యూనిట్లు ఆయన శుక్రవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్తను సంపదగా మార్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. తరుణ్ ఏజెన్సీ చెత్తను రీసైక్లింగ్ చేసే చర్యలు చేపట్టిందని ఆయన అన్నారు. దశలవారీగా చెత్తనంతటిని రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. కొన్ని దశాబ్దాలుగా దుర్గంధ భరితంగా ఉండే ఈ ప్రాంతం పచ్చని వనముగా తయారు చేసే ప్రణాళిక సిద్ధం చేశామని ఎమ్మెల్యే వివరించారు. చెత్త అంతటినీ రీసైక్లింగ్ చేసిన తర్వాత అక్కడ మొక్కలు తదితర వాటిని పెంచి సుందరమైన వనంగా తీర్చిదిద్దుతామన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య త్వరలోనే పూర్తిగా పోతుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఏదైనా మాట ఇచ్చిందంటే దానిని చేసి చూపుతుందని మరోసారి రుజువు చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్శిల్ కౌంటర్ బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీ

## చెక్కులుఅందజేసిన ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర



పార్వతీపురం, (చైతన్యరథం): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పార్శిల్ కౌంటర్ వద్ద గత నెల 19వ తేదీన దీపావళి సామగ్రి పేలుడు చోటు చేసుకున్న ఘటనలో బాధితులకు ప్రభుత్వం అందించిన సాయం చెక్కులను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పంపిణీ చేసారు. ఈ దుర్ఘటనలో గాయపడి, వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అండగా నిలిచిన సంగతి తెలిసిందే. విజయవాడ ప్రత్యేకంగా వెళ్లిన ఎమ్మెల్యే, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి బాధితుల పరిస్థితిని వివరించి ఆర్థిక సాయం మంజూరు చేయించారు. అలాగే రాష్ట్ర రవాణా శాఖామంత్రి ఎం రామ్ ప్రసాద్ రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించి పరిస్థితిని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన రవాణా శాఖ అధికారులు రూ. 9.75 లక్షలను సత్వర సాయంగా విడుదల చేశారు. శుక్రవారం బాతులు రెడ్డి రమేష్ కు 5 లక్షలు, కే. రమేష్ కు 4 లక్షలు, డ్రైవరు టి.రవికి 50 వేలు,బి సుందర్రావు రిక్షాకార్మికుడు 25 వేలు వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే విజయ్ చంద్ర అందజేసారు. ఈ సందర్భంగా బాధితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కష్టాలను గుర్తించి వెంటనే పరిహారం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు జీవితాంతం రుణపడిఉంటామని బాదితులు తెలిపారు. ప్రజల కష్టాలు తెలిసిన ఎమ్మెల్యే చల్లగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఎమ్మెల్యే తో పాటు ఆర్టీసీఅధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

## “ప్రజా దర్బార్”లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు, (చైతన్యరథం): సాలూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం “ప్రజా దర్బార్” రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అందించే పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరి సమస్య వేగంగా పరిష్కరించేందుకు అధికారులకు వెంటనే సూచనలు జారీ చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని మంత్రి స్పష్టం చేశారు.

జోన్-2

కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమండ్రి, ఏలూరు

చైతన్యరథం

# బాధిత రైతులకు అండగా టీడీపీ


## ఏలేరు కాలువ గండిని పరిశీలించిన జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్



కాకినాడ, (చైతన్యరథం): కిర్లంపూడి మండలం రాజుపాలెం వద్ద ఏలేరు కాలువకు గండి పడింది. ఏలేరు రిజర్వాయర్ లోకి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో కిందికి 8675 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దాంతో ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే అధికారులు పలు చోట్ల గట్లను పటిష్ట పరిచారు. ఐతే రాజుపాలెం వద్ద బలహీనంగా ఉన్న చోట నుండి నీరు పొంగి గండిపడింది. అలా గండిపడి వరి పంట పొలాలను ముంచుతోంది. గండిపడిన ప్రాంతాలను కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి రైతులను ముంచేస్తూ ఉంటుంది. నీరు ఎక్కువైనా పొలానికి ఇబ్బందే, నీరు తక్కువైన పొలానికి ఇబ్బందే. అయితే ప్రకృతి వల్ల రైతులు ఎప్పుడు నష్టపోతూ ఉన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి సకాలంలోనే వారికి నష్టపరిహారాన్ని అందజేస్తామని తెలియజేశారు.

# పేదల పాలిట పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కూటమి హయాంలో 22 దఫాలుగా రూ. 4.44 కోట్లు పంపిణీ




కొత్తపేట, (చైతన్యరథం): సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి వర్గాల వారికి ఉపశమనంగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ తో అర్హులందరికీ పారదర్శకంగా చెక్కుల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ల నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 22 దఫాలుగా రూ. 4.44 కోట్ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ఇటు ఇన్సూరెన్స్ కవర్ కాని రోగులకు సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా 7గురికి రూ.10,50,829ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్,జక్కంపూడి బాలాజీ, సూరపారెడ్డి సత్య, కూటమి నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యలకు సత్వర పరిష్కార వేదిక ప్రజాదర్బార్

## అర్జీలు స్వీకరించిన తుని ఎమ్మెల్యే ఎనమల దివ్య



తుని, (చైతన్యరథం): గాంధీ సత్రంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయిలతో కలిసి ఎమ్మెల్యే యనమల దివ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే యనమల దివ్యకు చైర్మెన్ కుండల రామకృష్ణ నేతృత్వంలో గాంధీసత్రం ధర్మకర్తల మండలి సభ్యులు సాదర స్వాగతం పలికారు. 11 నుంచి 15 వార్డుల నుంచి తరలి వచ్చిన ప్రజలు డ్రైనేజ్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. మరికొందరు హౌసింగ్,ఫింఛన్ల కోసం అర్జీలు అందజేసారు. ప్రజాదర్బార్ అనంతరం ఎమ్మెల్యే యనమల దివ్య మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు తుని పట్టణంలో నిర్వహించిన ప్రజాదర్బార్ లో ద్వారా 1 నుంచి 15 వార్డుల వరకు 283 వినతులు స్వీకరించగా ఇందులో 180 సమస్యల వరకు పరిష్కరించామన్నారు. సమస్యల పరిష్కార విషయంలో అధికారుల పనితీరును ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో యినుగంటి సత్యనారాయణ,మోతుకూరి వెంకటేష్, చైర్ పర్సన్ నార్ల భువన సుందరి టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, మల్ల గణేష్ అరిగెల నర్సింహమూర్తి,పరవాడ తాత బాబు, వైస్ చైర్ పర్సన్ కుచ్చర్ల పాటి రూపాదేవి కౌన్సిలర్లు చింతకాయల భారతి,కర్రి శ్రీదేవి,దారేష్,కమీషనర్ వెంకట్రావు,తహాశిల్దార్ ప్రసాదరావు మున్సిపల్ డీఈ చల్లకొండ నాగ సతీష్, కూటమి నాయకులు అద్దేపల్లి బాలాజీ, బీజేపీ రామకృష్ణ,గెడ్డమూరి శివ, సురేష్, కుక్కడపు బాలాజీ, తటవర్తి రాజా, ఉమ్మడి రమణ, అల్లు రాజు జల్లు వాసు కూరపాటి రఘు, దండెం నాగు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తలుపుల, (చైతన్యరథం): శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఏర్పాట్లను సత్యసాయి జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, కలెక్టర్ ఎం శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పరిశీలించారు.



# సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలి

## టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపు

పెద్దాపురం, (చైతన్యరథం): ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ప్రజా ఫిర్యాదు ల సమావేశంలో పాల్గొని, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ చర్యలు, సేవా కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచనలు అందించారు. ఈ సమావేశంలో నిమ్మకాయల రంగనాథ్, మండల అధ్యక్షుడు మొయ్యిళ్ల కృష్ణమూర్తి, పెద్దాపురం మాజీ మున్సిపాలిటీ చైర్మన్ రాజా సూరి బాబు రాజు, గౌరవాధ్యక్షుడు కుమారస్వామి, నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, శ్రీరాములుతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుపాను నష్టాలపై సమగ్ర నివేదికలివ్వండి

## అధికారులకు ఎమ్మెల్యే సత్యప్రభ ఆదేశం

ప్రత్తిపాడు, (చైతన్యరథం): స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సత్య ప్రభ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల మౌంథా తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో చోటుచేసుకున్న నష్టాలపై వివిధ శాఖల అధికారులు వివరమైన నివేదికలను ఎమ్మెల్యేకు సమర్పించారు. తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా, కొన్నిచోట్ల పూర్తిగా ధ్వంసమయ్యాయి. వందల ఎకరాలలో వరి, ప్రత్తి వంటి ఆహార, వాణిజ్య పంటలు, అరటి, బొప్పాయి, జీడిమామిడి వంటి ఉద్యాన పంటలు, కూరగాయ పంటలు కూడా ఈదురుగాలులు, వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే సత్య ప్రభ ఇప్పటికే వివిధ గ్రామాలలో పడిపోయిన ఇళ్లు, నీటమునిగిన పంటలు, ఏలేరు జలాశయం వద్ద వరదనీరు, విద్యుత్ సమస్యలు వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబం, ప్రతి రైతు వరకు ప్రభుత్వ సహాయం చేరేలా చూడాలని, అధికారులు మరింత సమగ్రంగా నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు.



# కేడర్‌కు తెలుగుదేశం పార్టీ అండ

## కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల బీమా పరిహారం అందించిన ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, (చైతన్యరథం): మండలంలోని కట్టుంగాకు చెందిన తెదేపా కార్యకర్త వందే విజయ కుమారి ఈమధ్య ప్రమాదవశాత్తు మృతి చెందగా,రూ. 5లక్షల ఇన్సూరెన్స్ ను విజయ కుమారి భర్త రమేష్ బాబుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రావులపాలెం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ ఆసరాగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు వ్యాఖ్యానించారు.



# అభివృద్ధి పనులకు భూములిచ్చిన రైతులను వెంటనే న్యాయం చేయాలి

### జాప్యంపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు




చిలకలూరిపేట, (చైతన్యరథం): ప్రభుత్వాలు తమకు న్యాయం చేస్తాయని నమ్మి అభివృద్ధిపనులకు భూములు, స్థలాలు ఇచ్చే రైతులకు వెంటనే న్యాయం చేయకపోతే పాలనా వ్యవస్థలపై వారికి అపనమ్మకం ఏర్పడదా అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి విస్తరణకు వ్యవసాయ భూములు, ఇళ్లు, స్థలాలు ఇచ్చిన రైతులు ప్రత్తిపాటిని కలిసి తమ సమస్య తెలియచేశారు. న్యాయంగా రావాల్సిన పరిహారం కోసం ఆందోళనలు, దర్నాలు చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని వాపోయారు. రైతుల సమస్య విన్న ప్రత్తిపాటి వారి సమక్షంలోనే నేరుగా జాయింట్ కలెక్టర్ తో మాట్లాడారు. వెంటనే సమస్యపై దృష్టి పెట్టాలని, రహదారి విస్తరణ పనులు పూర్తయినా నేటికీ వారికి పరిహారం ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విధంగా జాప్యం చేస్తే రైతులు భవిష్యత్‌లో ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఎలా సహకరిస్తారన్నారు. అలానే ఎండుగుం పాలెం ఎస్సీ కాలనీ వాసులు శ్మశానవాటికకు అవసరమైన భూమిని వెంటనే ప్రభుత్వమే కొనుగోలు చేసి తమకు అప్పగించాలని గతంలో అర్జీ ఇచ్చారని, మరలా నేడు సమస్యను మరోసారి తన దృష్టికి తీసుకొచ్చారని ప్రత్తిపాటి జేసీకి తెలిపారు. రెండు సమస్యల్ని వెంటనే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలన్న ప్రత్తిపాటి సూచనపై జేసీ సూరజ్ గనోరే స్పందించారు. అర్జీలు పరిశీలించి రెండు సమస్యల్ని వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని స్పష్టంచేశారు. శ్మశాన వాటిక భూమిని రైతుల నుంచి భూసేకరణ పద్ధతిలో తీసుకోవాల్సి ఉన్నందున ఆర్థిక పరమైన అంశమైనందున ప్రభుత్వాన్ని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని జేసీ తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలిచ్చిన అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటి, వారి సమక్షంలోనే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం దిశగా చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు మద్దూరి వీర రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులున్నారు.

# తుపాను దెబ్బకు కుదేలయిన అన్నదాతలు

### ప్రభుత్వానికి నివేదించి ఆదుకుంటామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ భరోసా



పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పర్యటించారు. ఉయ్యూరు రూరల్, కంకిపాడు మండలం అధికారులతో కలిసి సాయిపురం, ముదునూరు, జబర్లపూడి, చిన్న ఓగిరాల, కుందేరు గ్రామాల్లో వరిపంటలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావం వల్ల తీవ్రంగా వీచిన గాలులకు వరిచేలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులకు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు, కూటమి నేతలు, ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు చెప్పారు. క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న ప్రాంతాల్లో పంటచెలను పరిశీలన చేసిన ఎమ్మెల్యే, మండల పరిధిలో ఉన్న వ్యవసాయ అయకట్టు, ఏవిధమైన పంటలు ఉన్నాయి, ఎంతవరకు నష్టపోయాయి అనే విషయాలను క్షుణ్ణమైన పరిశీలన చేసి తుది నివేదిక అందించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ, మొంథా తుఫాను కారణంగా ప్రజలకు అండగా ఉండేలా ప్రభుత్వ యంత్రాంగమంతా ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రజలకు భరోసా కల్పించేలా ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చేయగలిగామని అన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా ఎకరాకు 35 వేల వరకూ పెట్టుబడి పెట్టిన రైతులు 30 రోజుల్లోపు దిగుబడి వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న సమయంలో తుఫాన్ ప్రభావం వలన తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సమన్వయంతో పూర్తి వివరాలు సేకరించి నష్టం జరిగిన అంచనాలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి రైతులకు సహాయం వచ్చేలా కృషి చేస్తానని, రైతులు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు చొరవతోనే ఊపిరి పీల్చుకున్నాం

### లంక గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వర్ల పిలుపు

తోట్లవల్లూరు, అక్టోబరు 31 : మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతోపాటు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణవేణమ్మ పరవళ్లుతొక్కుతోందని, ఈ నేపథ్యంలో కృష్ణాదిలో నీటి ప్రవాహం పెరుగుతుందని, ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచించారు. కృష్ణానదిలో పెరుగుతున్న నీటి ఉధృతి నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కుమార్రాజా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్, వీరంకి గురుమూర్తితో కలిసి మండల కేంద్రం తోట్లవల్లూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం కృష్ణానదిలో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని, లక్షలాది క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువునకు విడుదల చేస్తున్నారన్నారు. ఈ నీరు పల్లపు ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉందని, లంక గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇప్పటికే మొంథా తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఎంతో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ప్రాణనష్టం లేకుండా నియంత్రించగలిగామన్నారు. ఒకటి రెండు చోట్ల ఆస్తినష్టం మినహా ఎక్కడా ఎటువంటి ప్రాణం నష్టం చోటుచేసుకోలేదన్నారు. ఈ నెల 23 నుంచి అన్ని శాఖల ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులను సీఎం చంద్రబాబు నిత్యం అప్రమత్తం చేశారని, ప్రజల్లోకి వెళ్లి తుపాను ప్రభావం నుంచి బయటపడేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరాస కేంద్రాల్లోకి తీసుకువచ్చామని, వారికి కేంద్రంలో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. సురక్షిత తాగునీరు, అవసరమైన మందులు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. తుఫాన్ బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. బియ్యం 25 కేజీలు, కంది పప్పు 1కేజీ, పంచదార 1 కేజీ, వంటనూనె 1 లీటరు, బంగాళాదుంపలు 1 కేజీ ఉల్లిపాయలు 1 కేజీ మొత్తం ఆరు రకాలుతో కూడిన కిట్లను అందిస్తున్నామన్నారు. జిల్లాలో మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షలు జరిపి సమన్వయంగా పనిచేయడం ద్వారా పెను ప్రమాదం నుండి బయటపడ్డామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నాయన్నారు. కృష్ణానదికి పెరుగుతున్న ప్రవాహ ఉధృతిని దృష్టిలో ఉంచుకుని ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. తోట్లవల్లూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోను వరి, వాణిజ్య పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని, అయినా, ఎవరూ ఆందోళన చెందవద్దని, తుఫాను ప్రభావం తగ్గిన తరువాత అధికారులు పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తారని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా సాయమందిస్తామని, నష్టంపై సీఎం చంద్రబాబుతోపాటు సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి బాధిత రైతులకు న్యాయం జరిగేలాచూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కే.డి.సి.సి బ్యాంకు చైర్మన్ గుత్తా రాము, వంశీ కృష్ణ రెడ్డి, లుక్కా రేణుక రావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొరిపర్తి గోపయ్య, వల్లూరు రాంబాబు ,తోట సాయి, తట్కూరి రమణ, తోట రామకృష్ణ, సలాం, గోరిపర్తి శ్రీను, వీరంకి క్రిష్ణా, ఇర్ఫాన్ తదితరు ముఖ్య నాయకులు పాలొన్నారు.



# ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు, (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిడదవోలు పట్టణంలో రూ.184.74 కోట్లతో శరవేగంగా జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులను మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వోబీ నిర్మాణ మ్యాప్‌ను సునిశితంగా చూశారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడగగా 65 శాతం మేర పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం డ్రైన్ వర్క్స్ జరుగుతున్నాయని, అనంతరం సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడతామని అధికారులు తెలుపగా పనుల్లో జాప్యం లేకుండా మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆర్వోబీ నిర్మాణాన్ని నాణ్యతతో నిర్మించి నిడదవోలు నియోజవర్గ ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమన్నారు.



# కొత్త ఎస్పీని కలిసిన రావిపాటి కృష్ణ

గుంటూరు, (చైతన్యరథం): జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఇటీవల గుంటూరు జిల్లా వ్యాప్తంగా మెంథా తుఫాను సందర్భంగా సాంకేతికత వినియోగంతో ప్రజలను అప్రమత్తం చేయటంతో పాటు మరకద్రవ్యాలు వినియోగం, చైన్ స్నాచర్ల ఆగడాలు, అసాంఘిక శక్తుల పైన ఉక్కుపాదం మోపటంలో ఎస్పీ వకుల్ జిందాల్ తనదయిన గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం పోలీసు శాఖ సమన్వయంతో గత ప్రభుత్వం పెంచి పోషించిన గంజాయి డ్రగ్స్ మత్తుపదార్థాలను అరికట్టడంపై జరుగుతున్న పోరాటంలో యువతను చైతన్య పరిచేలా పోలీసు శాఖకు తమవంతు సహకారం అందజేస్తామని తెలియజేశారు.

# తప్పిన తుపాను.. వెంటాడుతున్న వరద

## అధికారులను, కూటమి శ్రేణులను అప్రమత్తం చేసిన మునిసిపల్ మంత్రి డాక్టర్ నారాయణ



నెల్లూరు, (చైతన్యరథం): సోమశిల జలాశయం, సంగం బ్యారేజ్‌ల నుంచి పెన్నాకు వరద పోటెత్తుతుండటంతో అధికారులను, టీడీపీ శ్రేణులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అప్రమత్తం చేశారు. ముందస్తు చర్యలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. మంత్రి ఆదేశాలతో టీడీపీ శ్రేణులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సోమశిలకు వరదనీరు పోటెత్తుతోంది. బీరాపేరు, బొగ్గేరు నుంచి కూడా వరద ప్రవాహం పెరగటంతో మొత్తం లక్షా 40 వేల క్యూసెక్కుల నీటిని సంగం బ్యారేజీ నుంచి పెన్నాకి విడుదల చేస్తున్నారు. వరద మరింత పెరిగే పరిస్థితుల్లో నదీ పరీవాహక లోతట్టు ప్రాంతాలకు ముప్పు పొంచి ఉండటంతో మంత్రి నారాయణ జిల్లా అధికారులను, పెన్నా ప్రభావం ఉన్న పరివాహక ప్రాంత టీడీపీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు వరదనీటిని అంచనా వేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. వాటర్ మానేజ్మెంట్ చేస్తూ సమన్వయంతో పనిచేసి మొంథా తుఫాన్ తరహాలోనే వరద ముప్పును కూడా తప్పించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి నారాయణ ఆదేశాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు టీడీపీ నేతలు పర్యవేక్షిస్తున్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలి రావాలని ప్రభావిత ప్రాంత వాసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. జాకీర్ హుస్సేన్ నగర్, కిసాన్ నగర్‌లలో లోతట్టు ప్రాంతాల్లోని నివాసప్రాంతాలకు వరద నీరు చేరటంతో నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించి భోజన ఏర్పాట్లు చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రత్యేక దృష్టి పెట్టి ముందస్తు చర్యలతో తమకు అండగా నిలుస్తున్న మంత్రి సేవల పట్ల నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# పల్లెలను తీర్చిదిద్దడమే కూటమి లక్ష్యం

## ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ వెల్లడి

ఆముదాలవలస, (చైతన్యరథం): నియోజకవర్గంలోని సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట గ్రామపంచాయతీలో గ్రామ అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేస్తూ, కోటి 30 లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఆమదాలవలస ఎమ్మెల్యే రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ . "గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. మతలబుపేట గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పూర్తవడంతో గ్రామ ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. ప్రతి ఇంటికీ సులభమైన రవాణా సౌకర్యం, శుభ్రమైన వాతావరణం కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామంలోని ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేస్తూ, తమ గ్రామ అభివృద్ధికి తీసుకున్న ఈ చర్యలపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యం, జనసేన ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్, మండల అధ్యక్షులు అంబాల రాంబాబు, మండల కూటమి ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎగువ నుండి వరద పోటెత్తడంతో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

# ఘనంగా జాతీయ పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవం

## పాల్గొన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్




ఉదయగిరి, (చైతన్యరథం): ఉదయగిరి మండల కేంద్రంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పోలీస్ సంస్మరణ వారోత్సవాలు, జాతీయ ఐక్యత – 2025 దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో ఇప్పటి వరకు 36వేల మంది పోలీస్ సిబ్బంది ప్రాణాలను అర్పించగా వారి త్యాగాలను గౌరవించుకుంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారి పేర్లతో కూడిన నేషనల్ పోలీస్ మెమోరియల్‌ను న్యూఢిల్లీలో ఏర్పాటు చేసి, జాతికి అంకితం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరు అమరులైన పోలీస్ వీరులను స్మరిస్తూ వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్పునిచ్చారని తెలిపారు.పోలీసులు సమాజానికి రక్షణ కవచంలా ఉంటారని, వారి సేవలు ప్రతి పౌరుడికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమము ముందుగా ఉదయగిరి సర్కిల్ పరిధిలోని ఎనిమిది మండలాల పోలీసు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు కలిసి ర్యాలీగా బయలుదేరి "పోలీస్ అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అనేక మంది పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, నోవా బ్లడ్ సెంటర్ వాలంటీర్లు పాల్గొన్నారు.



# ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబు... అరాచక నేత జగన్‌రెడ్డి!

అమరావతి, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశను వణికించిన మొంథా తుఫాను విలయతాండవం చేస్తున్న సమయంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోకేష్ లు మాత్రం బాధితులకు ఆప్తమిత్రుడిగా నిలిచారని. పదవి కాదు బాధ్యతకు విలువనిచ్చే నేతగా ఆంధ్ర రాష్ట్ర ప్రజల మనసుల్లో చంద్రబాబు చెరగని ముద్ర వేసుకున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు అమరావతిలో శు క్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ప ముందస్తు చర్యలతో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించి, తక్షణ సహాయం అందించారని ఆయన తెలిపారు. అర్ధరాత్రి 12:20 గంటలకు ఆర్టీజీఎస్ నుంచి ఇంటికి వెళ్లినా, ఉదయానికి మళ్లీ టెలీకాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్లు, అధికారులతో రియల్ టైమ్ మానిటరింగ్ చేసి ప్రజలను కాపాడారని ఆయన తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలోని "టీమ్ ఆంధ్ర" అహర్నిశలు శ్రమించి ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించారని. ప్రతి బాధితుడికీ నిత్యావసర సరుకులు, తక్షణ సహాయం అందేలా ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. తుపాను నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేసి, కేంద్రానికి నివేదిక సమర్పించాలని మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారని ఆయన తెలిపారు. ప్రతిపక్ష నేతగా చెప్పుకునే జగన్ రెడ్డి మాత్రం బెంగళూరు ప్యాలెస్‌లో సేద తీరుతూ, తన దొంగ మీడియా 'సాక్షి' ద్వారా చంద్రబాబు, లోకేష్‌పై ఫేక్ న్యూస్, విష ప్రచారం చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. లక్షల కోట్లు ఆస్తి ఉన్న జగన్ రెడ్డి బాధితులకు సాయం చేయకపోగా, కంటిమీద కునుకు లేకుండా ప్రజల్ని ఆదుకుంటున్న చంద్రబాబు లోకేష్‌లపై విషం కక్కటం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు తన పార్టీ నేతలే జగన్ కు కనీసం బాధ్యత లేదా అని జగన్ బెంగళూరులో ఉన్నారని వైసీపీ నాయకులతోపాటు, రాష్ట్ర ప్రజలంతా జగన్ పై దుమ్మెత్తి పోస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో తుఫాన్ ఆగిపోయిన నాలుగు రోజుల తర్వాత హెలికాప్టర్లో ఏరియల్ సర్వే చేసి తాడేపల్లి ప్యాలెస్ కు చేరుకునే వారిని అందుకే 151 సీట్లు నుంచి 11 సీట్లకు పడిపోయాడన్నారు. హుద్ హుద్ తుఫాను సమయంలో ప్రకటించిన 50 లక్షలు విజయవాడ వరదల్లో కోటి రూపాయలు ఇప్పటివరకు ఇవ్వని పులివెందుల పులకేశి ఇతనే గోదావరి వరదల్లో రెండు వారాలు ప్రజలు నీళ్లలో ఉంటే హెలికాప్టర్ పర్యటన చేసి జారుకున్నారని ఆయన విమర్శించారు. కుళ్లిపోయిన మూడు టమాటాలు రెండు బంగాళదుంపలు ఇచ్చి ప్రజలను గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం 98 శాతం పరిహారం అందించగా జగన్ హయాంలో సాయం అందిందో లేదో తెలియలేదని ఆయన విమర్శించారు చంద్రబాబు మాత్రం ఎప్పుడు విపత్తు లో ముందుండి నాయకత్వం వహిస్తారని 2018 లో వచ్చిన తిత్లీ తుపాన్లో శ్రీకాకుళం వణికిపోతే నిద్రాహారాలు మాని ప్రభుత్వము పార్టీ యంత్రాంగాన్ని కదిలించి బాధితులను ఆదుకున్న చరిత్ర చంద్రబాబుకు ఉందని ఆయన తెలిపారు 2014లో హుద్ హుద్ తుపాన్లో విశాఖలో సర్వం దంసమైందని 200 కిలోమీటర్ల వేగంతో గాలులు కరెంటు లేక ఫోన్లు పనిచేయక ప్రజలు ఇళ్లల్లో బంధీలయ్యారని 194లో వచ్చిన తుఫాను లో భయంకరమైనది హుద్ హుద్ తుఫానని ఆయన తెలిపారు చంద్రబాబు 9 రోజులు విశాఖలోనే మకామేసి విశాఖ నగరాన్ని పునర్నిర్మించారని ఆయన గుర్తు చేశారు 2009లో తుంగభద్ర వరదల్లో ప్రతిపక్షాలు ఎంతగా ఒక్క రోజులో 30 వేల మందికి సాయం అందించారని లేనిపోని విమర్శలు చేయకుండా నిర్మాణాత్మక ఇచ్చారని ఆయన తెలిపారు 2001లో గుజరాత్ మహారాష్ట్ర భూకంపాలకు ఇతోధిక సాయం చంద్రబాబు అందించారని ఆయన తెలిపారు 1996లో ఒరిస్సా తుఫానులో ఆంధ్రప్రదేశ్ నుండి విద్యుత్తు ఉద్యోగులను అక్కడకు పంపి పునరుద్ధరించారని ఆయన తెలిపారు చంద్రబాబు ఆపద్బాంధవుడు అని ఆయన వయసు అడ్డుకాలేదన్నారు నిద్రాహారాలు పక్కనపెట్టి బాధితులకు అండగా చంద్రబాబు నిలిచారన్నారు. తండ్రి బాటలోనే తనయుడు లోకేష్ కూడా ఆ పనులను మొంథా తుఫాన్లో నిద్రాహారాలు మాని రాష్ట్ర ప్రజలకు అండగా నిలిస్తే జగన్ తప్పుడు విమర్శలు చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు



# మన ఇంటికీ మన పయ్యావుల

## ఇంటింటినీ సందర్శించిన మంత్రి కేశవ్

ఉరవకొండ, (చైతన్యరథం): "ఇంటింటికీ మంత్రి" కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ పట్టణంలోని ఆర్డబ్ల్యుఎస్ కార్యాలయం పక్కన, అంబేద్కర్ నగర్, ఎంఈఓ కార్యాలయం వీధి, ఇందిరా నగర్, ఎన్జీఓ (బాబాగుడి), డ్రైవర్స్ కాలనీలలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించారు. నేరుగా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# తుపాను బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం



గన్నవరం, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో గన్నవరం మండల పరిధిలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలకు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో వసతి పొందిన దాదాపు 172 కుటుంబాలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం తరపున ప్రకటించిన నిత్యావసర సరుకులను, నగదు సహాయాన్ని గన్నవరం మండల తహసిల్దార్ కె.శివయ్య నేతృత్వంలో లబ్ధిదారులకుఅందజేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం మండల టీడీపీ అధ్యక్షుడు గూడపాటి తులసిమోహన్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, రాష్ట్ర టీడీపీకార్యదర్శి దొంతు చిన్నా, కృష్ణా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి బాబురావు, గన్నవరం మండల ప్రధాన కార్యదర్శి బోడపాటి రవి, ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు, ఏఎంసీ డైరెక్టర్ కానూరు శేషుమధవి, టీడీపీ నాయకులు అన్నే హరికృష్ణ, బుస్సే నాగప్రసాద్, సూరిబోయిన రాంబాబు, జనసేన పార్టీ నాయకులు చిమట రవివర్మ, టిడిపి బీసీ సెల్ నాయకులు మోదుగుమూడి సత్యనారాయణ, గన్నవరం మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు బుస్సీ సరిత, నెక్కంటి శ్రీదేవి, కంభంపాటి లక్ష్మీ నరసమ్మ, కేసరపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు కోసూరి వెంకట్, బుద్ధవరం పి.ఏ.సి.ఎస్ చైర్మన్ ముద్రబోయిన శ్రీను బీజేపీ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# తుపాను బాధల నుంచి త్వరగా బయటపడాలి

## తిరుమల శ్రీవారి సేవలో అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం, (చైతన్యరథం): కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి సేవలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గడిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, నాయకులు, బంధుమిత్రులతో కలిసి ఆయన తిరుమలకు వెళ్లారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో భాగంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే దగ్గుపాటికి వేద పండితులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ స్వామి వారిని ఎప్పుడు దర్శించుకున్న ఒక ప్రత్యేకమైన అనుభూతి ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చాలా ప్రాంతాల్లో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి నుంచి వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. స్వామి వారి ఆశీస్సులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎప్పుడు ఉండాలని ఆయన రాష్ట్రానికి మరిన్ని సేవలందించాలని కోరుకున్నారు.



# ముఖ్యమంత్రి ముందుచూపుతో తప్పిన తుపాను ముప్పు

విజయవాడ, (చైతన్యరథం): వీఎంసీ కల్యాణ మండపంలో అశ్రయం పొందిన 43 మంది మొంథా తుపాన్ బాధితులకు



ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, మాజీ కార్పొరేటర్ రామయ్య మనిషికి వెయ్యి రూపాయలు, 25 కిలోల బియ్యం, పంచదార, కిందిపప్పు, నూనె ప్యాకేట్లు అందచేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ముందుచూపుతో ప్రాణ నష్టం జరగకుండా తుపాను వల్ల ఎవరు ఇబ్బంది పడకుండా సన్నాహాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి పత్సవ మల్లికార్జున, అధికారులు నానీ కుమార్, గీత, కల్యాణ మండపం కాంట్రాక్టర్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కరువు సీమను సస్యశ్యామలం చేస్తున్న సీఎం చంద్రబాబు

## అనంత వెంకటరామిరెడ్డి విమర్శలపై టీడీపీ నేతల ధ్వజం




అనంతపురం, (చైతన్యరథం): భూకబ్జాలకు, లిక్కర్, రేషన్ మాఫియాలకు వైసీపీ నాయకులే బ్రాండ్ అంబాసిడర్లని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డికి అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు కౌంటర్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంతో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటిపై అనంత చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు తదితరులు మాట్లాడుతూ జగన్ రెడ్డి గత ఐదేళ్లలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయకుండా ఏసీ కార్లలో తిరిగారని విమర్శించారు. ఎక్కడ విపత్తులు వచ్చినా.. ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడ ఉంటూ సమర్థవంతంగా నష్ట నివారణకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన మీరు అనంతపురం నగరానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవాకు నీరు తీసుకొచ్చారన్నారు. 20 ఏళ్లుగా నీరు చూడని ప్రాంతాల్లో కూడా ఇప్పుడు పంటలు పండించే పరిస్థితి ఉందన్నారు. తాడిపత్రి, రాయదుర్గం వంటి ప్రాంతాలకు నీరందుతోందంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనత అన్నారు. కబ్జాలకు, కల్తీలకు మీరే బ్రాండ్ అంబాసిడర్ అని అనంతను దుయ్యబట్టారు. మీరు బెల్ట్ షాపులు నడిపింది నిజం కాదా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని కోటి సంతకాలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మీరు ఇంత స్వేచ్ఛగా తిరుగుతున్నారంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు క్రమశిక్షణ కల్గిన పాలన వలనేనని స్పష్టం చేశారు. మీ ప్రభుత్వ హయాంలో మేము వారంలో మూడు రోజుల పాటు పోలీస్ స్టేషన్లోనే గడపాల్సి వచ్చేదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. రైతుల గురించి మాట్లాడే అర్హత మీకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం వల్లనే అనంతపురం జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారిందన్నారు. గత ఐదేళ్లలో నగరంలో ఎన్ని కబ్జాలు చేశారో మీ కుటుంబ సభ్యులకు ఎన్ని ఎకరాల ఆస్తులు ఉన్నాయన్నది బహిర్గతం చేయాలన్నారు. మీ ఇంటి పక్కన ఎకరా భూమి కావాలని వస్తే దాంట్లో 30 సెంట్లు మా పేరు మీద రాస్తే.. అప్రూవల్ లో వచ్చేలా చూస్తామని బేరం పెట్టింది మీరుకాదా అని నిలదీశారు. మద్యం గురించి మాట్లాడుతున్న అనంత వెంకట్రామిరెడ్డి, వారి పాలనలో మహిళల తాళిబొట్లు తెంచిన సంగతులు మర్చిపోయారా అని ప్రశ్నించారు. మీ వియ్యంకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమ మద్యం ద్వారా కోట్లు సంపాదించారన్నది బయటపడిందన్నారు. గత ఐదేళ్లలో ఏ రోజైనా అనంతపురం సమస్యల గురించి అసెంబ్లీలో మాట్లాడారా అని నిలదీశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి తొలి అసెంబ్లీలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డంపింగ్ యార్డ్ సమస్యల గురించి మాట్లాడి వాటిని కార్యరూపంలోకి తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరుగుతోందని.. అది చూసి కడుపుమంటతో అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతున్నారన్నారు. లిక్కర్, రేషన్ గురించి మాట్లాడే అర్హత ఉందా లేదా అని ఒకసారి మీరే ఆలోచించుకోవాలన్నారు. రైతుల గురించి మాట్లాడుతున్న వారు ధరల స్థిరీకరణ నిధి అంటూ ఎన్నికల ముందు ప్రచారం చేసుకొని.. అధికారంలోకి వచ్చాక ఒక్కరోజైనా దాని గురించి ఆలోచించారా అని నిలదీశారు. మీ పాలనలో డ్రిప్పు పై సబ్సిడీ ఎత్తివేస్తే అప్పుడు మీరు ఎక్కడికిపోయారని ప్రశ్నించారు. లిక్కర్ మాఫియా నాయకుడు జగన్ రెడ్డి అని మీ పాలనలో నాసిరకం మద్యంతో ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. మీరు అవలంభిస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దుచేసి అన్ని రకాల బ్రాండ్లను విక్రయించేలా చేశారన్నారు. అనంతపురం రాజకీయాల్లోకి ఎవరు వచ్చిన వారిపై బురద చల్లడం, కుట్రలు చేయడం మీకు అలవాటైందన్నారు. మర్రిచెట్టులా వ్యాపించి దాని కింద ఎవరు ఎదగకూడదన్న దోరణి మీదన్నారు. టిడ్కో గృహాలను 2014 నుంచి 19 మధ్యలో కాలంలో దాదాపుగా పూర్తి చేస్తే వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా నాశనం చేశారన్నారు. జగనన్న లేఔట్లలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళ నాయకురాళ్లు కంఠాదేవి, దలవాయి రమాదేవి, టిడిపి నాయకులు ఎన్నికె నారాయణస్వామి, వడ్డే వెంకటేష్, రామలింగం, చెరుకూరి సుధాకర్, ఎస్సీ సెల్ నాయకులు నాగార్జున, శివ, ఎస్టీ సెల్ నాయకులు జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పహల్గాం ఉగ్రవాదులను హతమార్చిన...

## పోలీసులకు పురస్కారాలు

ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా వివిధ ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 1466 మంది పోలీసులకు కేంద్ర హోంశాఖ అత్యుత్తమ పురస్కారాలు ప్రకటించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పోలీసులు సహా కేంద్ర బలగాలను 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్ 2025'కు ఎంపిక చేశారు. వీరిలో జమ్ముకశ్మీర్‌లో పహల్గాం ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొన్న 40 మంది జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారు.

పహల్గాం దాడికి తెగబడిన ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత సైన్యం, జమ్మూ పోలీసులు, ఇతర భద్రతా దళాలు సంయుక్తంగా 'ఆపరేషన్ మహాదేవ్' చేపట్టి విజయం సాధించిన విషయంతెలిసిందే. ఇందులో పాల్గొన్న ఐజీ (కశ్మీర్ రేంజ్) వీకే బిర్డీ, సీనియర్ ఎస్పీ (శ్రీనగర్) జీవీ సందీప్ చక్రవర్తితోపాటు జమ్మూ కశ్మీర్‌కు చెందిన 19 మంది పోలీసులు హోంశాఖ అవార్డుకు ఎంపికయ్యారు. ఓ డీఐజీ సహా పలువురు ఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుళ్ల వరకు ఈ అవార్డు ఎంపికైన వారిలో ఉన్నారు. 21 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది కూడా ఈ మెడల్‌ను తీసుకోనున్నారు.

**తెలుగు రాష్ట్రాల నుంచి..**

తెలంగాణకు చెందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు (లక్ష్మణరావు,జాకబ్),ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు(చంద్రబాబు, ఉపేందర్‌రావు, తిరుపతి) ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఏపీకి చెందిన ఎస్పీ(అద్నాన్ నయీం అస్మి), అదనపు ఎస్పీ(భీమారావు), డీఎస్పీ(ఆర్జే జయసూర్య), ఎస్ఐ (ఎండీ నసీరుల్లా)తోపాటు ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్(ఫణి భూషణ్) ఈఅవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది.

హోంశాఖ పరిధిలో గతంలో ఉన్న వివిధ ప్రతిభా పురస్కారాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చిన కేంద్రప్రభుత్వం..'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్‌ను 2024లో ప్రవేశపెట్టింది.భారత తొలి హోం మంత్రి సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతి రోజైన 'ఏక్తా దివస్' సందర్భంగా ఏటా అక్టోబర్ 31న వీటిని ప్రకటిస్తారు. 2025ఏడాదికి గాను దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, ఇంటెలిజెన్స్, ఫోరెన్సిక్ సైన్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 1466 మంది పోలీసు, భద్రతా సిబ్బందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు.

# పాక్‌కు మన బలం తెలియజెప్పాం

## - ఏక్తా దివస్‌లో ప్రధాని మోదీ



దేశ సమగ్రత, ఐక్యతకు తాము కట్టుబడి ఉన్నామని, భారత్‌పై కన్నెత్తి చూస్తే ఉద్రవాదులను వారి దేశంలోకే వెళ్లి హతమారుస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ విశ్వసించారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని ప్రధాని కొనియాడారు. ఏక్తా దివస్ సందర్భంగా గుజరాత్‌లోని కెవాడియాలో ఐక్యతా విగ్రహం (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) వద్ద శుక్రవారం పటేల్ 150వ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రధాని ప్రసంగించారు. స్వాతంత్ర్యం తర్వాత 550 సంస్థానాలను ఏకం చేసి అసాధ్యమైన పనిని సుసాధ్యం చేశారు. ఆయనకు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ దార్శనికత అత్యంత ముఖ్యమైంది. దానిని మేం సమర్థిస్తాం. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల మాదిరిగానే ఏక్తా దివస్‌ను జరుపుకొంటున్నాం. భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. విభజన శక్తులకు దూరంగా ఉండాలి. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించింది. నక్సల్స్ ఏరివేత కోసం ఎన్నో ఆపరేషన్స్ చేశాం. నక్సలిజం మూలాలను సమూలంగా పెకిలిస్తాం. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో కలపాలని పటేల్ ఆకాంక్షించారు. దానిని నెహ్రూ గౌరవించలేదు. పటేల్, అంబేద్కర్‌లను కాంగ్రెస్ అవమానించింది. ఆయన దూరదృష్టిని మరిచిపోయింది. కాంగ్రెస్ చేసిన తప్పు వల్లే కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించింది. దానివల్ల కశ్మీర్, దేశంలో అశాంతి నెలకొంది. ఉగ్రవాదాన్ని దాయాది దేశం పెంచి పోషించింది. ఇంత జరిగినా ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ తలవంచింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో ఆ ఉగ్రవాదులతో పాటు, ఆ దేశానికీ తెలిసింది. దేశ ఐక్యతను బలోపేతం చేసే చర్యలను ప్రోత్సహించాం. ఆయన ఆకాంక్షలను మేం గౌరవించాం. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటుంటే కొందరికి బాధగా ఉంటుంది. దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేద్దాం" అని మోదీ పిలుపు ఇచ్చారు. పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల చేశామని వెల్లడించారు. ఈ రోజు పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని ప్రత్యేక పరేడ్ ఏర్పాటుచేశారు. ఇందులో సైనిక దళాల కవాతు ఆకట్టుకుంది.

# కోటి ప్రభుత్వ ఉద్యోగాలు

## - బీహార్‌లో ఎన్డీఏ ఎన్నికల మేనిఫెస్టో విడుదల




పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మరికొన్ని రోజుల్లో జరగనుంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచార జోరు పెంచాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా బీహార్ అధికార ఎన్డీయే కూటమి శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. వలస కార్మికులను ఆకట్టుకునేలా రాష్ట్రంలో కోటి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. పాట్నాలో జరిగిన కార్యక్రమంలో సంకల్ప పత్రపేరుతో భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఈ మ్యానిఫెస్టోను విడుదలచేశారు. ఎల్డీపీ(రాంవిలాస్) పార్టీ చీఫ్ చిరాగ్ పాసవాన్ కూడా పాల్గొన్నారు..

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలివే..**

రాష్ట్రంలోని యువతకు కోటి ప్రభుత్వ ఉద్యోగాలు. ప్రతి జిల్లాలో మెగా నైపుణ్య కేంద్రాల ఏర్పాటు

కేజీ టు పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య

ఏడాదికి రూ.లక్ష వరకు సంపాదించేలా కోటి మంది మహిళలను 'లక్‌పతి దీదీ'లుగా మార్చడమే లక్ష్యం. మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ.2 లక్షల వరకు ఆర్థికసాయం.

ఈబీసీలకు రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకాలు. రాష్ట్రంలో సామాజిక-ఆర్థిక పరిస్థితులను అంచనా వేసేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.9వేలు పెట్టుబడి సాయం. మూడు విడతల్లో ఈ మొత్తం చెల్లింపు

బీహార్‌లో ఏడు ఎక్స్ ప్రెస్‌వేల నిర్మాణం, నాలుగు నగరాల్లో మెట్రో రైలు సేవల ఏర్పాటు.

5 ఏళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు

ప్రతి జిల్లాలో తయారీ యూనిట్లు, మెడికల్ కాలేజీల ఏర్పాటు

గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

# రెండు వారాల్లో రష్యా మహిళ వివరాలు సేకరించండి

బిడ్డ సంరక్షణపై భారత్‌కు చెందిన భర్త, రష్యాకుచెందిన భార్య చేస్తోన్న న్యాయ పోరాటంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రష్యా మహిళ ఆచూకీపై ఆ దేశ ఎంబసీ నుంచి తగిన స్పందన రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. రెండు దేశాల సంబంధాలను ప్రభావితం చేసేఎలాంటి ఉత్తర్వులను మేం జారీ చేయాలని అనుకోవడం లేదు. ఇది ఒక చిన్నారికి సంబంధించిన కేసు. ఇది చాలా సున్నితమైన అంశం. తన తల్లితో ఉన్నందున ఆ బిడ్డ క్షేమంగా ఉన్నాడని మేం ఆశిస్తున్నాం. ఇది చిన్నారుల అక్రమ రవాణా కేసు కాదని మేం భావిస్తున్నామని కోర్టు వ్యాఖ్యానించింది. అలాగే ఆమె వివరాలను సేకరించేందుకు అధికారులకు రెండు వారాల గడువు ఇచ్చింది. గత విచారణలో కోర్టుస్పందిస్తూ..తల్లి లేక తండ్రికి ఇంతవరకు చిన్నారి కస్టడీ బాధ్యతలను తాము అప్పగించనప్పటికీ సుప్రీంకోర్టు కస్టడీ నుంచి ఆబిడ్డను లాగేసుకుపోయారని అని తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే.

తన నుంచి విడిపోయిన రష్యన్ మహిళ వద్ద ఉన్న బిడ్డ సంరక్షణ కోసం భారత్‌కు చెందిన తండ్రి పోరాడుతున్నాడు. గతంలో న్యాయస్థానం ఆదేశాలను ఆమె పట్టించుకోలేదని ఆరోపించారు.

జులై 7నుంచి బిడ్డ తోపాటు ఆమె ఆచూకీ తెలియడం లేదని, ఆమెను కోర్టు పరిధి నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. జులై 4న రష్యన్ ఎంబసీ వెనుకద్వారం నుంచిఓ దౌత్యాధికారి ఆమెను లోపలికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోం దన్నారు. ఆమె సరిహద్దు దాటి నేపాల్లోకి ప్రవేశించి.. అక్కడి నుంచి షార్జా మీదుగా రష్యాకు వెళ్లినట్లుగా భావిస్తున్నామని గత విచారణలో కేంద్రం వెల్లడించింది.

మాస్కోలోని భారత ఎంబసీ ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా.. రష్యా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని విదేశాంగశాఖ వెల్లడించింది. ఢిల్లీ పోలీసులు ఇదే విషయాన్ని వెల్లడించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించి ఉంటే. ఆ మహిళ అంత సులువుగా దేశం దాటి వెళ్లగలిగేవారు కాదని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆమె జాడ గుర్తించేందుకు ఇంటర్ పోల్ సహాయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే ఆదేశించింది.

# ఏదో శక్తి నన్ను కాపాడింది..



మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఓ యాక్టింగ్ స్టూడియోలో పట్టపగలే చిన్నారులను నిర్బంధించిన వ్యక్తిని పోలీసులు హతమార్చిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటన పై తాజాగా మరాఠీ నటి రుచితా విజయ్ జాదవ్ స్పందిస్తూ సంచలన విషయాలు వెల్లడించారు. పిల్లలను బంధించడానికి రెండ్రోజుల ముందు తాను కూడా ఆ కిడ్నాపర్ రోహిత్ ఆర్యను కలవాల్సి ఉందని ఆమె తెలిపారు. అతడి బారిన పడకుండా తాను త్రుటిలో తప్పించుకున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రాంలో సుదీర్ఘ పోస్ట్ చేశారు.

కొద్ది రోజుల క్రితం రోహిత్ ఆర్య అనే వ్యక్తి ప్రొడ్యూసర్‌గా నాకు పరిచయమయ్యాడు. ఓ ఫిల్మ్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడాలన్నాడు. బంధించడం నేపథ్యంలో సినిమా తీయనున్నట్లు చెప్పాడు. దీంతో కథ వినేందుకు నేను అంగీకరించా. అక్టోబరు 23న అతడు నాకు మెసేజ్ చేసి కథ చెప్పేందుకు అపాయింట్‌మెంట్ కావాలని అడిగాడు. అక్టోబరు 28న కలుస్తానని చెప్పా. అక్టోబరు 27న పవయీ ప్రాంతంలోని తన ఆర్ఎ స్టూడియో అడ్రసు, లొకేషన్‌ను నాకు షేర్ చేశాడు. అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ మీటింగ్‌ను నేను చివరి నిమిషంలో రద్దు చేసుకున్నా. తాజాగా మీడియాలో అతడి గురించి వార్త చూడగానే వణికిపోయా. రెండు రోజుల క్రితం నేను కలవాల్సిన అదే వ్యక్తి.. ఇలా పిల్లలను బంధించాడని తెలిసి షాక్ అయ్యా. ఆ రోజు ఏదో శక్తి నన్ను కాపాడినట్లు అనిపిస్తోంది. అతడి బారిన పడకుండా నన్ను కాపాడిన భగవంతుడికి, మా కుటుంబసభ్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటా. ఈ ఘటనతో నేనో విషయం తెలుసుకున్నా.. కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకునేందుకు ముందు మనం చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. మీరు ఎక్కడికి వెళ్తున్నారు? ఏం చేస్తున్నారనే విషయాలను కుటుంబసభ్యులతో పంచుకోండి.. అని నటి రుచితా జాదవ్ రాసుకొచ్చారు.

పవయీ ప్రాంతంలోని ఆర్ఎ స్టూడియోలో గురువారం మధ్యాహ్నం ఆడిషన్స్ కోసం వచ్చిన పిల్లలను రోహిత్ ఆర్య (50) బంధించాడు. సమాచారం అందుకొన్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకోగా, అదే సమయంలో రోహిత్ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో విడుదల చేశాడు. చర్చల కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పోలీసులు మొదటి అంతస్తులోని మరుగుదొడ్డి మార్గంలో నుంచి స్టూడియో లోపలికి ప్రవేశించి బందీలుగా ఉన్న పిల్లలను రక్షించారు. అది చూసిన రోహిత్ ఎయిర్‌గన్‌తో పిల్లలకు హాని తలపెట్టబోగా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అతడు మరణించాడు.

# వలసదారులపై కక్షగట్టిన ట్రంప్

## భారత్‌ను ఆక్షేపిస్తూ.. వీడియో ప్రకటన



మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలు.. ఇలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈక్రమంలోనే హెచ్-1బీ వీసాదారులను ఉద్దేశించి ట్రంప్ యంత్రాంగం అక్కసు వెళ్లగక్కింది. ఈమేరకు లేబర్ డిపార్ట్‌మెంట్ ఎక్స్ వేదికగా ఒక యాడ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీసాను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్ యువత స్థానంలో విదేశీ కార్మికులతో భర్తీ చేస్తున్నాయని నిందించింది. ఆ వీసాదారుల్లో అత్యధికులు భారతీయులే ఉన్నారని ఆక్షేపించింది. "హెచ్-1బీ వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువ అమెరికన్ల అమెరికా డ్రీమ్ దొంగతనానికి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తోన్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం. అమెరికా ప్రజల కోసం అమెరికా కలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. కష్టపడి పనిచేస్తే.. అమెరికా కలను సాధించుకోవచ్చని మేం తరతరాలుగా చెప్తున్నాం. కానీ మా యువత విషయంలో అలా జరగడం లేదు" అని యాడ్‌లో ప్రస్తావించారు. హెచ్-1బీల్లో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని ఒక గ్రాఫ్‌రూపంలో వెల్లడించారు. ఈ వీసా విషయంలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయా..? అని గుర్తించేందుకు 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' పేరిట లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ఈ సమయంలోనే ఈ యాడ్‌ను పోస్ట్ చేసింది. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీయువతతో భర్తీ చేయకుండా చూడటమే దీని ఉద్దేశం.

హెచ్-1బీ వీసా విషయంలో ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం సంచలనం సృష్టించింది. "హెచ్-1బీ వీసా వ్యవస్థ మోసాలతో నిండి ఉంది. అది అమెరికన్ల వేతనాలను తగ్గించింది. కాబట్టి ట్రంప్ ఈ వ్యవస్థను మెరుగుపరచాలనుకుంటున్నారు" అని అమెరికా ప్రభుత్వం స్పందించిన సంగతి తెలిసిందే. అయితే ఆయన నిర్ణయాన్ని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసింది. ట్రంప్ నిర్ణయం కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను దెబ్బతీస్తోందని ఆ గ్రూప్ ఆందోళన వ్యక్తంచేసింది. హెచ్-1బీపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని తన వ్యాజ్యంలో వాదించింది. ఇక పలు ఉద్యోగ సంఘాలు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ఆయనకు లేఖ కూడా రాశారు. ట్రంప్ నిర్ణయం యూఎస్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నైపుణ్యం కలిగిన వలసదారులను కోల్పోవాల్సి ఉంటుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు.



# మిషిగన్‌లో హింసాత్మక దాడులకు కుట్ర

## హాలోవీన్ వీకెండ్‌పై అప్రమత్తంగా ఉన్నాం: కాశ్‌పటేల్

అమెరికాలో హాలోవీన్ వీకెండ్ సందర్భంగా మిషిగన్‌లో హింసాత్మక దాడులకు కుట్ర పన్నారనే వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించి పలువురు అనుమానితులను అరెస్టు చేసినట్టు అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్, భారత సంతతి నేత కాశ్ పటేల్ వెల్లడించారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్న ఆయన.. ఈ సందర్భంగా ఎఫ్‌బీఐ సిబ్బందిని అభినందించారు. పూర్తి అప్రమత్తతతో ఉంటూ దేశ రక్షణలో నిమగ్నమయ్యారని ప్రశంసించారు. మరోవైపు నగరంలో ఎఫ్‌బీఐ ఆపరేషన్ కొనసాగిస్తున్న విషయం తెలుసని మిషిగన్‌లోని డియర్‌బోర్న్ పోలీసులు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ప్రస్తుతానికి నగర ప్రజలకు ఎటువంటి ముప్పు లేదని స్పష్టం చేశారు. హాలోవీన్ వేడుకలను అమెరికా సహా అనేక దేశాల్లో అక్టోబర్ 31న ఘనంగా చేసుకుంటారు. గుమ్మడికాయలను రకరకాల ఆకృతుల్లో అలంకరించి, స్నేహితులు, బంధువులంతా విందూ వినోదాలతో ఆనందంగా గడుపుతారు. దెయ్యాలు, రాక్షసుల దుస్తులు ధరించి ఇతరులను భయపెట్టే ప్రయత్నం చేస్తారు. కాస్ట్యూమ్స్, డెకరేషన్స్, క్యాండీల కోసం అమెరికన్లు ఈసారి 13 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టే అవకాశం ఉందని అంచనా. అయితే, వివిధ దేశాలపై ట్రంప్ విధించిన భారీ సుంకాలతో వీటి ధరలు భారీగా పెరిగినట్టు తెలుస్తోంది.

# తమ్ముడిని ఇంటినుంచి గెంటేసిన బ్రిటన్ రాజు

- ఎప్‌స్టైన్ సెక్స్ కుంభకోణం పత్రాల్లో ఆండ్రూ పేరు
- చార్లెస్ బాధితులవైపే ఉంటారన్న బకింగ్‌హామ్ ప్యాలెస్

అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం కేసు పత్రాల్లో ప్రముఖ రాజకీయ నాయకులు, ధనవంతులతోపాటు బ్రిటన్ యువరాజు ఆండ్రూ పేరు కూడా బయటికొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తనకున్న రాయల్ టైటిల్‌ను ఇటీవల ఆండ్రూ వదులుకున్నారు. ఈక్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్ రాజు చార్లెస్ 3 తన సోదరిడిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఆండ్రూకు ఉన్న బిరుదులన్నింటినీ తొలగించడంతోపాటు ఆయనను బలవంతంగా ఇంటినుంచి పంపించేసినట్లు తెలుస్తోంది. బకింగ్‌హామ్ ప్యాలెస్ ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొంది. దివంగత రాణి ఎలిజబెత్ రెండో కుమారుడు, చార్లెస్ తమ్ముడు ఆండ్రూ. జెఫ్రీ





ఎప్‌స్టైన్ సెక్స్ కుంభకోణం కేసు పత్రాల్లో పేరు వెలువడినప్పటి నుంచి ఆండ్రూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇటీవల తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను వదులుకున్నారు. ఈక్రమంలోనే ప్రిన్స్ ఆండ్రూకు ఉన్న అన్ని రాజ బిరుదులు, గౌరవాలు, అధికారాలను రాజు చార్లెస్ తొలగించారని బకింగ్హామ్ ప్యాలెస్ పేర్కొంది. ఆయన ప్రస్తుతం లీజుకు తీసుకుని ఉంటున్న లండన్‌లోని విండ్సర్ ఎస్టేట్‌ను కూడా ఖాళీ చేయాలని అధికారిక నోటీసులు పంపినట్టు వెల్లడించింది. దీంతో ఆండ్రూ తూర్పు ఇంగ్లాండ్‌లోని సాండ్రిగో హెూమ్ ప్రైవేటు ఎస్టేట్‌లోకి మారతారని తెలిపింది. తనపై వచ్చిన ఆరోపణలను ఆండ్రూ పలుమార్లు తిరస్కరించిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. అయినా ఈ చర్యలు అనివార్యమని రాజు భావిస్తున్నట్టు తెలిపింది. ఈ సందర్భంగా రాజు చార్లెస్, రాణి కెమిల్లా కుంభకోణంలోని బాధితులవైపే ఉంటారని స్పష్టం చేసింది. ఎప్‌స్టైన్ సెక్స్ కుంభకోణం అగ్రరాజ్యాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన వర్జీనియా గ్రీఫీ అనే బాధితురాలు ప్రిన్స్ ఆండ్రూపై లైంగిక ఆరోపణలు చేసింది. 17 ఏళ్ల వయసులో యువరాజు తనను మూడుసార్లు అనుభవించాడని ఆమె పేర్కొంది. అయితే, ఈ ఆరోపణలను ఆండ్రూ ఎప్పటికప్పుడు తిరస్కరిస్తూ వచ్చాడు. ఇటీవల గ్రీఫీ రాసిన 'నోబడీస్ గర్ల్' అనే పుస్తకం విడుదల నేపథ్యంలో ఆండ్రూ పేరు మరోసారి చర్చకు వచ్చింది. ఈ క్రమంలోనే తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# రెండో టీ 20 కంగారూలదే



- స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన ఆస్ట్రేలియా
- భారత బ్యాటర్లలో రాణించిన అభిషేక్ శర్మ

మెల్‌బోర్న్ వేదికగా భారత్‌తో శుక్రవారం జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. 13.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 18.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ తొలి నుంచి దూకుడుగానే ఆడింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (46: 26 బంతుల్లో, 2 ఫోర్లు, 4 సిక్సులు) రాణించాడు. అతడు ఔట్ కావడానికి ముందు రెండు ఫోర్లు, రెండు సిక్సులతో విరుచుకుపడ్డాడు. 7.6 ఓవర్లో కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (28: 15 బంతుల్లో, 1 ఫోర్) క్రీజులో ఉన్నంత వరకు దూకుడుగానే ఆడాడు. జోస్ ఇంగ్లిస్ (20: 20 బంతుల్లో, 1 ఫోర్) ఫర్వాలేదనిపించాడు.

భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, బుమ్రా తలో రెండు వికెట్లు తీసుకున్నారు.. బ్యాటింగ్ లో రాణించిన హర్షిత్ రాణా.. బౌలింగ్లో మాత్రం ప్రభావం చూపించలేకపోయాడు. ఆఖర్లో భారత బౌలర్లు వెంట వెంటనే వికెట్లు తీసుకున్నప్పటికీ ఆసీస్‌ను మాత్రం నిలువరించలేకపోయారు.



### అభిషేక్ శర్మ ఒంటరి పోరాటం..

అంతకు ముందు టీమిండియా బ్యాటర్లు ఈ మ్యాచ్‌లో ఘోరంగా విఫలమయ్యారు. అభిషేక్ శర్మ(68), హర్షిత్ రాణా(35) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ కనీసం రెండు అంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ పవర్ ప్లేలోనే మూడు వికెట్లు తీసి భారత్ టాప్ ఆర్డర్‌ను వరుసగా పెవిలియన్ పంపాడు.

ఓపెనర్ అభిషేక్ శర్మ(68) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఓ పక్క వరుసగా వికెట్లు పడుతున్నా ఒత్తిడికి గురి కాకుండా షాట్లు ఆడుతూనే వచ్చాడు. టాప్ ఆర్డర్ అంతా కుప్పకూలిన సమయంలో నంబర్ 7లో వచ్చిన హర్షిత్ రాణా(35) ఫర్వాలేదనిపించాడు. వీరి భాగస్వామ్యంతోనే టీమిండియా ఓ మోస్తరు స్కోరు అయినా చేయగలిగింది. శుభ్‌మన్ గిల్(5), సంజూ శాంసన్(2), సూర్య కుమార్ యాదవ్(1), తిలక్ వర్మ(0), అక్షర్ పటేల్(7) ఘోరంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో హేజిల్‌వుడ్ 3, బ్రేట్‌లెట్, నాథన్ ఎల్లిస్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. స్టోయినిస్ ఒక వికెట్ తీశాడు.

# కేకేఆర్‌కు రోహిత్?



ఐపీఎల్– 2026 దగ్గర పడుతున్న సమయంలో రోహిత్ శర్మ.. ముంబై ఇండియన్స్‌ను వీడి కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)లో చేరనున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. కేకేఆర్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు బలం చేకూర్చింది. దానికి తోడు తాజాగా కేకేఆర్ హెడ్ కోచ్‌గా నియమితుడైన అభిషేక్ నాయర్.. రోహిత్‌కు అత్యంత సన్నిహితుడు కావటం ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తోంది. అభిషేక్ నాయర్ మార్గదర్శకత్వంలో రోహిత్ కేకేఆర్‌లో ఆడే అవకాశాలు లేకపోలేదని అభిమానులు అంటున్నారు. రోహిత్ శర్మ, అభిషేక్ నాయర్ స్నేహం కూడా ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. రోహిత్‌కు ఫిట్‌నెస్ ట్రైనింగ్‌లో అభిషేక్ గైడ్ చేశాడు. నాయర్ సూచనలతో జిమ్‌లో కసరత్తులు చేసి హిట్‌మ్యాన్ ఏకంగా పది కిలోల బరువు తగ్గి అద్భుత ఫామ్‌ను తిరిగి సాధించారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఓ సెంచరీ, హాఫ్ సెంచరీ సాధించి అదరగొట్టాడు. ఈ ఫామ్‌తో రోహిత్ తొలిసారిగా ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు.

ఈ నేపథ్యంలో కేకేఆర్ తన ఎక్స్ ఖాతాలో రోహిత్ శర్మకు శుభాకాంక్షలు తెలియజేసింది. 'మీరు ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నారు.. దీనికి మీరు అర్హులు, అభినందనలు రోహిత్' అంటూ పేర్కొంది.

అయితే ఒక అభిమాని ఆ పోస్ట్‌కి 'అయితే కన్ఫామ్ అనుకోవచ్చా..?' అని కామెంట్ చేయగా కేకేఆర్ స్పందించింది. 'నంబర్ 1 వన్డే బ్యాటర్ కన్ఫామ్' అంటూ సమాధానం ఇచ్చింది. ఆ వ్యక్తి వెంటనే 'అంటే హిట్‌మ్యాన్ కేకేఆర్‌లో చేరినట్టే..' అని జవాబు ఇవ్వడంతో ఈ సంభాషణ క్షణాల్లోనే వైరల్ అయింది. దీంతో రోహిత్ కేకేఆర్‌లో చేరటం ఖాయమనే అనుకుంటున్నారు.

ఈ వార్తలన్నీ జోరుగా ప్రచారం అవుతున్న నేపథ్యంలో.. ముంబై ఇండియన్స్ కూడా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'సూర్యుడు మళ్లీ రేపు ఉదయిస్తాడు. కానీ రాత్రిపూట ఉదయించడం అసాధ్యం!' అని పేర్కొంది. ఈ పోస్ట్ బట్టి రోహిత్ శర్మ ముంబైని వదిలి వెళ్లడం అసాధ్యం అని కూడా అభిమానులు అనుకుంటున్నారు.

అయితే ఇప్పటివరకు రోహిత్ శర్మ ఈ అంశంపై అధికారికంగా స్పందించలేదు. కానీ ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందే ఆటగాళ్ల రిటెన్షన్, వేలం సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ ఊహాగానాలు మరింత వేడెక్కుతున్నాయి.

# జెమీమాతో కలిసి పాడపాడతా..

మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు టీమ్ ఇండియా దూసుకెళ్లింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్ తుది పోరుకు అర్హత సాధించింది. ఆదివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో టీమ్ ఇండియా తలపడనుంది. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అభిమానులకు ఓ హామీ ఇచ్చాడు. భారత్ కప్ గెలిస్తే.. సెమీస్‌లో అజేయంగా సెంచరీ చేసిన జెమీమా రోడ్రిగ్స్ కలిసి పాట పాడతానని వెల్లడించాడు. అయితే, జెమీమా అందుకు అంగీకరిస్తేనేనని స్పష్టంచేశాడు. ఇంతకుముందు భారత పురుషుల జట్టు టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు మైదానంలోనే గవాస్కర్ డ్యాన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఒకవేళ భారత్ వన్డే ప్రపంచ కప్ గెలిస్తే.. నేను జెమీమాతో కలిసి పాట పాడుతా. ఆమె గిటార్ అద్భుతంగా వాయిస్తుంది. గిటార్ వాయిస్తూ ఉంటే నేను గాయకుడిగా మారతా. మేమిద్దరం కొన్నాళ్ల కిందట బీసీసీఐ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నాం. అక్కడ బ్యాండ్ ప్లే అవుతూ ఉంటే మేమిద్దరం జాయిన్ అయ్యాం. జెమీమా గిటార్ ప్లే చేసింది. నేను నా వాయిస్ తో ఏదో పాడేశా. అందుకే అభిమానులకు హామీ ఇస్తున్నా.. మన జట్టు వరల్డ్ కప్ గెలిస్తే మరోసారి ప్రదర్శన ఇస్తాం. అయితే, ఈ ఓల్డ్‌మ్యాన్‌తో కలిసి ప్లే చేయడం జెమీమాకు ఇష్టమైతేనే సుమా.. అని గవాస్కర్ చమత్కరించాడు. 2024లో బీసీసీఐ ఏర్పాటుచేసిన అవార్డుల కార్యక్రమంలో జెమీమా రోడ్రిగ్స్ గిటారు ప్లే చేసి అలరించింది. అక్కడి స్టేజ్ పైకి వెళ్లిన సునీల్ గవాస్కర్ తన గానంతో క్రికెటర్లను ఆకట్టుకున్నాడు.





# వెల్‌డన్ టీమిండియా

- అమ్మాయిల క్రికెట్ జట్టుపై దిగ్గజాల ప్రశంసలు

మహిళల ప్రపంచ క్రికెట్‌లో ఆస్ట్రేలియాకు తిరిగే లేదు. ఆ జట్టు ఇప్పటి వరకు ఏడుసార్లు వన్డే ప్రపంచ కప్ నెగ్గింది. ఈ సారి అదే దూకుడుతో బరిలోకి దిగింది. అజేయంగా సెమీస్‌కు చేరుకున్న ఆసీస్‌కు టీమిండియా అడ్డుగా నిలబడింది. దీనికి కారణం జెమీమా రోడ్రిగ్స్ బ్యాటింగ్ మెరుపులే. అద్భుతమైన సెంచరీతో జెమీమా(127 నాటౌట్) చెలరేగగా.. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(89) హాఫ్ సెంచరీతో అదరగొట్టింది. దీంతో టీమిండియాపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. భారత దిగ్గజాలు విరాట్, సచిన్, వీరేంద్ర సెహ్వాగ్ ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

ఆస్ట్రేలియా వంటి బలమైన ప్రత్యర్థిపై మన జట్టు అద్భుత విజయం సాధించింది. భారీ టార్గెట్‌ను ఛేదించడం తేలికైన విషయం కాదు. ఇలాంటి తీవ్ర ఒత్తిడి ఉన్న మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్ సూపర్ ఇన్నింగ్స్ ఆడింది. నమ్మకం, ఆటపై నిబద్ధత, గెలవాలనే తపనే ఈ గెలుపుకు కారణం. వెల్ డన్ టీమిండియా' అని విరాట సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టాడు.

జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్ కౌర్ జట్టును ముందుండి నడిపించారు. శ్రీచరణి, దీప్తి శర్మ బంతితో రాణించి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇలాగే మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా' అని భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేర్కొన్నాడు.

ఇది కేవలం మరో సెమీ ఫైనల్.. సులువుగా గెలిచేసి ఫైనల్‌కు చేరుకుంటామని ఆసీస్ భావించింది. మన అమ్మాయిలు మాత్రం సంచలనం సృష్టించే అవకాశం ఇదే అని భావించారు. వారిపై వచ్చిన విమర్శలను పక్కన పెట్టారు. టీమిండియా ఆటను చూసి ఇప్పుడు ప్రతి ఒక్కరూ గర్వపడుతున్నారని అని వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు.

అసాధారణ ధైర్యం.. అద్వితీయ పోరాటం.. చిరస్మరణీయ ఇన్నింగ్స్, మహిళల వన్డే ప్రపంచకప్‌లో మన అమ్మాయిల విజయం అద్భుతం అని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కొనియాడాడు.

## జెమీమాను ఆకాశానికెత్తేసిన ఆసీస్ మీడియా



సాధారణంగా ఆస్ట్రేలియా ఓడిపోతే ప్రత్యర్థి జట్టు, ఆట గాళ్లపై ఆ దేశమీడియా అక్కసు వెళ్లగక్కుతుంది. ఇందుకు ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. భారత పురుషుల జట్టు బోర్డర్– గవాస్కర్ ట్రోఫీలో గెలిచినా.. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ మంచి ప్రదర్శన చేసినా ఏదొక కారణం చూపుతూ ఆసీస్ ఓటమిని ఆ దేశ మీడియా తక్కువ చేసి చూపించేది. కానీ, ఈసారి మాత్రం అలా కాదు. ఆ దేశ మీడియా పతాక శీర్షికల్లో టీమ్ ఇండియా మహిళా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై ప్రశంసల వర్షం కురిపించింది. ఇక తమ జట్టు కెప్టెన్ ఎలీసా హీలీపై విమర్శలు చేశాయి. జెమీమా ఇచ్చిన క్యాచ్‌ను చేజార్చడం వల్లే తమ జట్టు ఓడిపోయిందని అందులో పేర్కొన్నాయి.

సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 339 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ మరో 9 బంతులు మిగిలిఉండగానే విజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ 127 పరుగులతో అజేయంగా నిలిచింది.ఆసీస్ మీడియా ఏబీసీ న్యూస్.. జెమీమా ప్రదర్శనను అభినందిస్తూ 'స్టన్నింగ్ ఇన్నింగ్స్.అద్భుతమైన లక్ష్య ఛేదన'అంటూ కామెంట్ చేసింది.ఇక ఫాక్స్ క్రికెట్ కూడా జెమీమాను అభినందిస్తూనే ఎలీసా హీలీని విమర్శించింది. ఆస్ట్రేలియా వరల్డ్ కప్ నుంచి నిష్క్రమించడానికి ప్రధాన కారణం క్యాచ్‌లు డ్రాప్ చేయడమే. రికార్డు లక్ష్య ఛేదనలో జెమీమా జీవితకాలం గుర్తుండిపోయే ఇన్నింగ్స్ ఆడింది" అని కథనాల్లో పేర్కొంది. గుడ్ మార్నింగ్ ఆస్ట్రేలియా.. భారత్ అద్భుతమైన రన్ ఛేజింగ్‌తో వరల్డ్ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కథ ముగిసింది.. అని పోస్టు పెట్టింది.

## చిన్ని గుండెలో.. అంటున్న రామ్

రామ్ పోతినేని హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. ఇద్దరి మధ్య సాగే 'చిన్ని గుండెలో' పాటను చిత్ర బృందం శుక్రవారం విడుదల చేసింది. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని మెర్విన్, సత్య యామిని పాడారు. వివేక్- మెర్విన్ స్వరాలు సమకూర్చారు. పాట ఆకట్టుకుంది. చిత్రంలో ప్రముఖ నటుడు ఉపేంద్ర కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆయన వీరాభిమానిగా రామ్ కనిపించనున్నారు. నవంబరు 28న సినిమా విడుదల కానుంది.



## పెద్ది.. బుచ్చిబాబు హింట్ వైరల్



రామ్‌చరణ్ హీరోగా జాన్వీకపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పెద్ది ప్రాజెక్టుకు మంచి హైప్ ఉన్న విషయం తెలిసిందే. ప్రతీ చిన్న అంశాన్ని కేర్ తీసుకొని బుచ్చిబాబు ప్లాన్ చేస్తున్న సినిమాకి ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూరుస్తున్నారు. మంచి అంచనాలు ఆల్బమ్‌పై ఉండగా.. ఈ మధ్య హైదరాబాద్‌లో రెహమాన్ చేయనున్న కచేరి కార్యక్రమంలో పెద్ది సాంగ్ ప్రదర్శన ఉంటుందని టాక్ ఉంది. అయితే ఇప్పుడు ఇది దాదాపు ఖరారు అన్నట్టు దర్శకుడు బుచ్చిబాబు లేటెస్ట్ హింట్‌తో కన్ఫర్మ్ అయ్యింది. రెహమాన్ కచేరిపై వేసిన పోస్ట్‌లో చివరి లైన్‌గా సంథింగ్ స్పెషల్ రాబోతుంది అని చేసిన పోస్ట్ పెద్ది ఫస్ట్ సింగిల్‌పై మరిన్ని ఆశలు రేకెత్తించింది. సో అది తెలియాలంటే నవంబర్ 8వరకు ఆగాల్సిందే.

## ఫస్ట్ సింగిల్ డేట్ ఫిక్సయ్యిందా?



నందమూరి బాలకృష్ణ హీరోగా దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కించిన చిత్రం అఖండ 2 తాండవం. పాన్ ఇండియా లెవెల్లో ఒక బ్లాస్టింగ్ ట్రీట్‌ని ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్న సినిమా కోసం అభిమానులు ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తున్నారు. ఇక సంగీత దర్శకుడు థమన్ కూడా అంతకుమించిన ప్రయోగాలు చేస్తూ థియేటర్స్‌లో మాస్ ట్రీట్‌ని ప్రామిస్ చేస్తున్నాడు. అయితే ఇప్పుడు అఖండ 2 ఫస్ట్ సింగిల్‌పై లేటెస్ట్ బజ్ వినిపిస్తోంది. దీని ప్రకారం అఖండ 2 మొదటి సాంగ్‌ని మేకర్స్ నవంబర్ 5న రిలీజ్ చేసే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇక దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి 14 రీల్ ప్లస్ నిర్మాణం వహిస్తుండగా.. డిసెంబర్ 5న గ్రాండ్‌గా రిలీజ్‌కి రానుంది.

## ప్రశాంత్‌కు అడ్వాన్స్ ఇవ్వలేదు



దర్శకుడు ప్రశాంత్ వర్మపై వస్తున్న ఫేక్ న్యూస్‌ను నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖండించింది. ఆ దర్శకుడికి తాము ఎలాంటి అడ్వాన్స్ ఇవ్వలేదని తెలుపుతూ పోస్ట్ పెట్టింది. ఇటీవల వరుస సినిమాలు ప్రకటించిన ప్రశాంత్ వర్మ.. వీటికోసం కొన్ని నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్సులు తీసుకున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఆ నిర్మాణ సంస్థల జాబితాలో డీవీవీ ఎంటర్టైన్మెంట్ కూడా ఉండడంతో తాజాగా దీనిపై స్పందిస్తూ పోస్ట్ పెట్టింది. "డీవీవీ ఎంటర్టైన్మెంట్ సంస్థ ఏ ప్రాజెక్ట్ కోసమూ అడ్వాన్స్ ఇవ్వలేదు. మాకు, దర్శకుడికీ మధ్య వ్యాపారపరమైన ఒప్పందాలు జరగలేదు. ఏదైనా వార్తను ప్రచారం చేసేముందు అందులో నిజానిజాలు తెలుసుకోవాలని కోరుతున్నాం. ఇలాంటి వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం" అని నోట్ విడుదల చేసింది. తన సినిమాటిక్ యూనివర్సుకు సంబంధించి ప్రస్తుతం చాలా స్క్రిప్టులు సిద్ధమవుతున్నాయని.. తొలి ఫేజ్‌లో ఆరుగురు సూపర్ హీరోల సినిమాలు తీస్తామని గతంలో ప్రశాంత్ వర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 'మహా కాళీ', 'అధీర'లను ప్రకటించారు. ప్రశాంతవర్మ సినిమాటిక్ యూనివర్స్‌నుంచి ప్రతి ఏడాదీ ఒక సినిమా విడుదలవుతుందని ఆయన గతంలోనే తెలిపారు.

## డీప్ ఫేక్ భయాలొద్దన్న చిరు

టెక్నాలజీని మంచి కోసం వాడుకోవాలని చిరంజీవి అన్నారు. తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో జరిగిన ఏక్తా దివస్ కార్యక్రమానికి చిరంజీవి హాజరయ్యారు. దేశాన్ని ఏకం చేసి మనకందించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్‌లాంటి గొప్ప వ్యక్తుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో పోలీస్ వ్యవస్థ చాలా బలంగా ఉందని కొనియాడారు. ప్రజలకు పోలీసులు అండగా ఉన్నారని అందరూ ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా చిరంజీవి తెలిపారు. అలాగే ప్రజలకు, సెలబ్రిటీలకు తలనొప్పిగా మారిన డీప్ ఫేక్, సైబర్ నేరాలపై చిరంజీవి స్పందించారు. "డీప్ ఫేక్ అంశాన్ని ఇప్పటికే పోలీసులు దృష్టికి తీసుకెళ్లాను. డీజీపీ, సీపీ సజ్జనార్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఎవరూ డీప్ ఫేక్, సైబర్ నేరాలకు భయపడాల్సిన అవసరం లేదు. దీనిపై ఒక చట్టం తీసుకొచ్చేలా ప్రయత్నం చేస్తున్నారు. కచ్చితంగా అది జరగాలని కోరుకుంటున్నా. వీటినుంచి సామాన్యులకు కూడా రక్షణ కలిగిస్తారు. పోలీసులు చాలా ఫ్రెండ్లీగా ఉంటున్నారు. సామాన్యులు కూడా ఈ విషయంలో భయపడాల్సిన అవసరం లేదు"అని చిరంజీవి అన్నారు. టెక్నాలజీని మంచికి ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.



## ది ఎపిక్'పై నీల్ వెరైటీ రివ్యూ



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన అద్భుతం 'బాహుబలి'. తెలుగు సినిమా స్థాయిని ప్రపంచానికి చూపిన ఈ బ్లాక్‌బస్టర్ పదేళ్ల తర్వాత 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ప్రేక్షకుల ముందుకువచ్చిన సంగతి తెలిసిందే. అప్పుడు ప్రేక్షకులకు ఏ థ్రిల్‌ను పంచిందో.. ఇప్పుడూ అలానే అలరిస్తోంది. తాజాగా ఈ సినిమాపై దర్శకుడు ప్రశాంత్ నీల్ రివ్యూ ఇచ్చారు. చిన్న కథ రూపంలో పంచుకున్నారు. ప్రశాంత్ నీల్ రివ్యూను ఆయన భార్య లిఖిత తన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. "ఒక రోడ్డుకు మరమ్మతులు చేయాల్సి వచ్చింది. దీంతో అందరూ కలిసి ఓ కాంట్రాక్టర్‌ను పిలిచారు. ఆ కాంట్రాక్టర్ ఆ రోడ్డుకు మరమ్మతులు చేయడమే కాకుండా.. ఏకంగా దాన్ని 16 వరుసల హైవేగా మార్చేశాడు. ఆ రోడ్డు ఏదో కాదు.. పాన్ ఇండియా, ఆ కాంట్రాక్టర్ మరెవరో కాదు రాజమౌళినే" అంటూ జక్కన్న టాలెంట్‌ను ప్రశాంత్ నీల్ అభినందించారు. బాహుబలి టీమ్ మొత్తానికి శుభాకాంక్షలు తెలిపారు. ఒక తరం కోసం ఈ టీమ్ అంతా ఎన్నో కలలు కన్నదని కొనియాడారు. రెండు భాగాలను కలిపి రాజమౌళి ఒకే పార్ట్ గా 'బాహుబలి: ది ఎపిక్' పేరిట రీరిలీజ్ చేశారు. రెండు భాగాల్లో తొంభై నిమిషాలకు పైగా సన్నివేశాలను తొలగించి దీన్ని విడుదల చేశారు. అవంతిక లవ్ స్టోరీ, పచ్చబొట్టేసిన పాట, ఇరుక్కుపో సాంగ్, కన్నా నిదురించరా సాంగ్, యుద్ధానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను తొలగించారు. అన్ని మార్పులు చేసినప్పటికీ కథలో ఎక్కడా లోటు లేకుండా తన మార్క్ చూపారంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు.

## ఓటీటీకి కాంతార, లోక

కన్నడ స్టార్ నటుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి హీరోగా రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించిన కాంతార చాప్టర్ 1.. ఫైనల్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. థియేటర్స్‌లో బాగానే రన్ అవుతున్న ఈ సినిమా ఓటీటీ ఒప్పందం మేరకు కేవలం సౌత్ భాషల్లో మాత్రమే అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి వచ్చింది. సో ఈ డివోషనల్ హిట్ చిత్రాన్ని చూడాలి అనుకుంటే.. ప్రైమ్ వీడియోలో ఇపుడు చూడొచ్చు. ఇక –బాలీవుడ్ యువ హీరో టైగర్ ష్రాఫ్ హీరోగా నటించే సినిమాల సిరీస్‌లలో "బాఘి" సిరీస్ కూడా ఒకటి. మన దక్షిణాదినుంచి పలు సూపర్ హిట్ సినిమాలని తను రీమేక్ చేస్తూ ఈ సిరీస్‌ని కొనసాగిస్తున్నాడు. భారీ బడ్జెట్‌లు యాక్షన్‌తో ప్లాన్ చేసిన ఈ సినిమాల నుంచి వచ్చిన లేటెస్ట్ సినిమానే "బాఘి 4". కొన్ని రోజులు కితమే అమెజాన్ ప్రైమ్ వీడియోలో రెంటడ్‌గా స్ట్రీమింగ్ కి వచ్చింది. అయితే ఈ సినిమా ప్రస్తుతం ఫ్రీ స్ట్రీమింగ్‌కి ప్రైమ్ వీడియోలో ఉంది. కేవలం ప్రైమ్ వీడియో సబ్‌స్క్రైబర్ అయ్యి ఉంటే ఇకనుంచి ఈ సినిమా ఇందులో చూడొచ్చు. ఈ సినిమాలో సోనమ్ బజ్వా హీరోయిన్‌గా నటించింది. అలాగే –మలయాళ సినిమాగా సంచలన విజయం అందుకున్న చిత్రమే లోక చాప్టర్ 1 చంద్ర. దర్శకుడు డామినిక్ అరుణ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో తెరకెక్కించిన ఈ క్రేజీ సూపర్ హీరో సినిమా తెలుగులో కొత్త లోక పేరిట విడుదలై మన దగ్గర కూడా మంచి వసూళ్లు అందుకుంది. ఇక ఎట్టకేలకు ఈ బ్లాక్ బస్టర్ హిట్ చిత్రం ఓటీటీ ఆడియెన్స్‌ని అలరించేందుకు వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు జియో హాట్ స్టార్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక అందులో ఈ సినిమా ఇవాళ్టి నుంచి పాన్ ఇండియా భాషల్లో అందుబాటులోకి వచ్చేసింది. అప్పుడు ఎవరైనా మిస్ అయ్యి ఉంటే ఈసారి తప్పకుండా చూడవచ్చు. ఇక ఈ సినిమాలో శాండీ మాస్టర్, టోవినో థామస్ తదితరులు నటించగా దుల్కర్ సల్మాన్ నిర్మాణం వహించారు.

## 'కలలు కనండి.. కప్పు పట్టుకురండి'

టీమ్ ఇండియాను చూసి దేశం గర్విస్తోందని అగ్ర దర్శకుడు రాజమౌళి అభినందనలు తెలిపారు. మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లిన విషయం తెలిసిందే. సెమీస్‌లో కంగారూలను చిత్తుచేసి ఫైనల్లోలోకి అడుగుపెట్టింది. దీంతో హర్మన్ ప్రీత్ సేనపై సినీ సెలబ్రిటీలు ప్రశంసలు కురిపిస్తున్నారు. దేశం గర్వించేలా చేశారంటూ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. "అద్భుతమైన భారత మహిళా క్రికెట్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు. ఎంతో ధైర్యంతో చరిత్రలో ఇప్పటివరకూ ఎవరూ ఛేదించలేని స్కోరు మీరు సాధించి దేశం గర్వపడేలా చేశారు. ఫైనల్లో మరోసారి చరిత్ర సృష్టించండి" అంటూ రాజమౌళి ట్వీట్ చేశారు. "టీమిండియా.. అద్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టింది. సెమీ ఫైనల్లో రికార్డు స్కోరును ఛేదించడం చిన్న విషయం కాదు. జెమీమా, హర్మన్ ప్రీత్, రిచా, దీప్తి అందరూ గొప్పగా ఆడారు. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. ఇదే ఉత్సాహంతో ట్రోఫీని తీసుకురండి" అంటీ హీరో వెంకటేష్ అభినందనలు తెలిపారు. "నిజంగా ఇది గొప్ప వార్త.. మనం ఫైనల్స్‌కు చేరాం. టీమ్ ఇండియాకు అభినందనలు" –అంటూ లావణ్య త్రిపాఠి ట్వీట్ చేశారు. "కలలు కనండి.. మిమ్మల్ని మీరు నమ్మండి.. విజయాన్ని సాధించండి.. నిజమైన ఛాంపియన్లు ఎలా ఉంటారో మన మహిళలు ప్రపంచానికి చూపించారు. సరికొత్త చరిత్ర సృష్టిస్తూ భారత్ ఫైనల్లో అడుగుపెట్టింది" అంటూ సోనూసూద్, "ఇవి భారత్‌కు గొప్ప క్షణాలు. ఉత్కంఠభరితమైన విజయంతో మన మహిళల జట్టు ఫైనల్‌కు దూసుకుపోయింది. దృఢ సంకల్పం, ఐక్యత, ప్రతిభ అన్నిటితో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. శుభాకాంక్షలు" అంటూ రిషబ్ శెట్టి ట్వీట్ చేశారు.